RNI No.: TELTEL/2023/90269

# తెలంగాణ షాన్

ప్రతి పదం ప్రజల పక్షం

తెలుగు దిన పత్రిక

# TELANGANA SHAAN

Telugu Daily

Malkajgiri | Volume: 3 | Issue: 267 | Sunday, February 8, 2026 | Editor: RAMANCHARLA SRIKANTH | Pages: 4 | Rs. 4/-

మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 267 | ఆదివారం, ఫిబ్రవరి 8, 2026 | ఎడిటర్: రామన్‌చర్ల శ్రీకాంత్ | పేజిలు : 4 | వెల : రూ.4 /-

విలేకరులు కావలెను

తెలంగాణ షాన్

తెలుగు దినపత్రిక

నందు రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు
నియోజకవర్గ ఇన్ఛార్జ్‌లు
మండలాల వారిగా విలేకరులు కావలెను

ఆసక్తి గల యువతీ యువకులు

సంప్రదించవలసిన మొబైల్ నెంబర్: 99637 08331

## గజ్వేల్‌లో హరీశ్‌కు నిరసన సెగ



సిద్ధిపేట, ఫిబ్రవరి 7 : గజ్వేల్ – ప్రజ్ఞాపూర్‌లోని ముంపు గ్రామాల్లో శనివారం మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి వెళ్లిన మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుకునిరసన సెగ తగిలింది. హరీశ్ రావు రాకముందే.. ఆర్ అండ్ ఆర్ కాలనీ ముంపు గ్రామాల ప్రజలు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా నిరసనకారులు 'హరీశ్‌రావు డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేశారు. మరోవైపు బీఆర్ఎస్ కార్యకర్తలు కూడా ప్రతి నినాదాలు చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ముంపు గ్రామాల బాధితులు, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య పోటా పోటీ నినాదాలు కొనసాగాయి. పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారి, ఇరువర్గాలు ఒకరిపై ఒకరు చెప్పులు విసురుకోవడంతో స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు.. ఇరువర్గాలకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు స్వల్పంగా లాఠీఛార్జ్ చేయడంతో ఉద్రిక్తత కొంతమేర తగ్గింది. ఈ పరిణామాల నేపథ్యంలో హరీశ్‌రావు.. గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లోనే నిలిచిపోయినట్లు సమాచారం. ప్రస్తుతం అక్కడ భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

### కేంద్రంపై పిచ్చి ప్రేలాపనలు మానుకో..

## సీఎం రేవంత్‌కు కిషన్‌రెడ్డి వార్నింగ్



హైదరాబాద్, ఫిబ్రవరి 7 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటరిచ్చారు. తమను విమర్శించే ముందు సీఎం రేవంత్ ఒకసారి ఆత్మ విమర్శ చేసుకోవాలని హితవు పలికారు. శనివారం ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. రేవంత్ తనను కల్వకుంట్ల కిషన్ రావు అని విమర్శించారని.. తానెలా కల్వకుంట్ల కిషన్ రావు అవుతాను? అని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబాన్ని కాపాడాల్సిన అవసరం తనకు ఎందుకుంటుందని నిలదీశారు.పనికిరాని, పసలేని ఆరోపణలు చేయడం రేవంత్ రెడ్డికి బాగా అలవాటైందని కిషన్ రెడ్డి ఎద్దేవా చేశారు. రేవంత్ చెత్త విమర్శలకు తాను చాలాసార్లు కౌంటరిచ్చానని అన్నారు. మళ్లీ మళ్లీ ఆయన పిచ్చి ప్రేలాపనలు చేయొద్దని.. ఈ విషయాన్ని ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. కేంద్రంపై అనవసరంగా మాట్లాడితే ఊరుకోమని హెచ్చరించారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి నాడు ఇందిరాగాంధీని గెలిపిస్తే.. ఆ జిల్లా ప్రజలకు, తెలంగాణకు ఆమె ఏం చేశారో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చాక దేశంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని కిషన్ రెడ్డి వివరించారు. తమ ఎంపీలకు మోదీ సమ ప్రాధాన్యం ఇస్తారని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాల తర్వాత కేంద్రం తెలంగాణకు ఏం చేసిందో చెబుతామని తెలిపారు. ఈ ఎన్నికల ప్రచారానికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వచ్చే అంశంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉందని కిషన్ రెడ్డి తెలిపారు.

### మున్సిపల్ ఎన్నికల్లోనూ

## కాంగ్రెస్ ఘన విజయం ఖాయం:మంత్రి తుమ్మల



**హుస్నాబాద్ :**సిద్ధిపేట జిల్లా హుస్నాబాద్ వేదికగా జరిగిన మీడియా సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి పాల్గొన్న ఆయన, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గత రెండు సంవత్సరాలుగా అసాధ్యమని భావించిన ఎన్నో సమస్యలను తమ ప్రభుత్వం పరిష్కరించిందని స్పష్టం చేశారు. కేవలం అసూయతోనే ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలు చేస్తున్నాయని, ప్రజలు వారిని ఎప్పుడో తిరస్కరించారని ఆయన ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన విప్లవాత్మక నిర్ణయాలను మంత్రి తుమ్మల ఈ సందర్భంగా గుర్తు చేశారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా బీసీ కులగణన చేపట్టిన ఘనత తమ ప్రభుత్వానిదేనని ఆయన గర్వంగా ప్రకటించారు. తెలంగాణను ఆదర్శంగా తీసుకునే నేడు కేంద్ర ప్రభుత్వం కూడా తలవంచి కులగణన చేపట్టబోతోందని ఆయన పేర్కొన్నారు. అలాగే ఎస్సీ వర్గీకరణ (ఎా, దీ, జ, ఐ) విషయంలో దశాబ్దాల నాటి కల సాకారం చేస్తూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నామని వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ. 13,000 కోట్లు వెచ్చించి పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణేనని ఆయన వెల్లడించారు. గత పదేళ్ల పాలనలో ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిన వారే నేడు నీతులు మాట్లాడుతున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. "రైతాంగం, పేదలు, నిరుద్యోగులు సంతోషంగా ఉంటే ఓర్వలేక ప్రతిపక్షాలు కారుకూతలు కూస్తున్నాయి. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ , పంచాయతీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పని అయిపోయిందని ప్రచారం చేశారు, కానీ ప్రజలు తమ ఓటుతో మమ్మల్ని ఆశీర్వదించి వారికి బుద్ధి చెప్పారు" అని తుమ్మల గుర్తు చేశారు. ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లో కూడా అదే స్థాయిలో ప్రతిపక్షాల విమర్శలకు ప్రజలు సమాధానం చెబుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం ఆశించిన స్థాయిలో సహకరించకపోయినప్పటికీ, అవసరమైతే తల తాకట్టు పెట్టయినా సరే అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని మంత్రి తుమ్మల తేల్చి చెప్పారు. తాము చేసే పనులే తమకు రక్షణ అని, కాంగ్రెస్ పార్టీ ఎవరి విమర్శలకూ బెదరదని ఆయన స్పష్టం చేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో 100 శాతం కాంగ్రెస్ పార్టీ విజయం సాధించబోతోందని ఆయన జోస్యం చెప్పారు.

## ట్రంప్ మరో షాక్.. ఇరాన్‌తో వ్యాపారం దేశాలపై 25 శాతం సుంకం విధింపు

**వాషింగ్టన్,ఫిబ్రవరి 7:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరో షాకిచ్చారు. ఇరాన్‌తో వ్యాపారం చేసే దేశాలపై కఠిన ఆంక్షలు విధించారు. ప్రస్తుతం రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఇరాన్‌తో వ్యాపారం చేసే దేశాలపై 25 శాతం అదనపు సుంకం విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు కార్యనిర్వాహక ఉత్తర్వుపై ట్రంప్ సంతకం చేశారు. డిసెంబర్ 28 నుంచి ఇరాన్‌లో ఖమేనీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు జరుగుతున్నాయి. అయితే భద్రతా దళాల కాల్పుల్లో 30 వేల మంది నిరసనకారులు ప్రాణాలు కోల్పోయారు. దీంతో ట్రంప్ బెదిరింపులకు దిగారు. నిరసనకారులను చంపితే దాడులు చేస్తామని హెచ్చరించారు. అంతేకాకుండా యూఎస్ఎస్ అబ్రహం లింకన్ యుద్ధ నౌక అరేబియా సముద్రానికి చేరుకుంది. దీంతో రెండు దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం కొనసాగుతోంది. ఇలాంటి టెన్షన్ వాతావరణంలో ఇరాన్‌పై మరో కఠిన వైఖరి తీసుకున్నారు. ఇరాన్‌తో వ్యాపారం చేసే దేశాలపై అదనపు సుంకాలు విధించే కార్యనిర్వాహక ఉత్తర్వుపై శుక్రవారం ట్రంప్ సంతకం చేశారు. వైట్‌హౌస్ ప్రకారం.. ఇరాన్ నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై 25 శాతం అదనపు సుంకం విధించవచ్చని పేర్కొంది. ఇరాన్‌కు సంబంధించిన వస్తువులు, సేవలను ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా కొనుగోలు దేశాలపై సుంకాలు అమలవుతాయి. ఈ ఆదేశం అమల్లోకి వచ్చిన దగ్గర నుంచి సుంకాలు విధించవచ్చు. అమెరికా జాతీయ భద్రత, విదేశాంగ విధానం, ఆర్థిక ప్రయోజనాలను కాపాడటానికి ఈ చర్య తీసుకున్నట్లు వైట్‌హౌస్ తెలిపింది. కార్యనిర్వాహక ఉత్తర్వు ప్రకారం... సుంకాలు విధానాన్ని అమలు చేయడానికి, నిబంధనలు, మార్గదర్శకాలను జారీ చేయడంతో సహా సంబంధిత చర్యలు అమలు చేయడానికి విదేశాంగ కార్యదర్శి, యునైటెడ్ స్టేట్స్ వాణిజ్య ప్రతినిధికి అధికారం ఇచ్చింది. ఇరాన్ దుర్మార్గపు చర్యను అడ్డుకునే భాగంలో ఈ చర్య తీసుకున్నట్లు వైట్‌హౌస్ స్పష్టం చేసింది. ఇరాన్ అణు సామర్థ్యాలను అనుసరిస్తుందని.. ఉగ్రవాదానికి మద్దతు ఇస్తుందని... బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమాన్ని అనుసరిస్తుందని.. ప్రాంతీయ అస్థిరతను పెంచుతోందని అమెరికా ఆరోపించింది. మధ్యప్రాచ్యంలో ప్రాక్సీ ఉగ్రవాద గ్రూపులకు ఇరాన్ మద్దతు ఇస్తుందని.. సొంత పౌరులను అణిచివేస్తుందని... వనరులన్నింటినీ అణు, క్షిపణి కార్యక్రమాలక్కు మళ్లిస్తుందని అమెరికా ధ్వజమెత్తింది.

# ఎనిమిదేళ్లు ఇందిరమ్మ రాజ్యమే..

### వికారాబాద్‌ను ప్రపంచ పర్యాటక కేంద్రంగా మారుస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి



**వికారాబాద్ ,ఫిబ్రవరి 7:**వికారాబాద్ జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా నారాయణపూర్‌లో నిర్వహించిన ప్రజాపాలన–ప్రగతిబాట బహిరంగ సభ పాల్గొన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇందిరా మహిళా శక్తి చెక్కుల పంపిణీ చేశారు సీఎం రేవంత్ రెడ్డి. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వం చేసిన అప్పులను, తప్పులను సరిదిద్దుకుంటూ తమ ప్రభుత్వం రాష్ట్ర ప్రగతి కోసం ముందుకు వెళుతోందని ఆయన స్పష్టం చేశారు. పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్, కేంద్రంలో పన్నెండేళ్లుగా ఉన్న మోదీ రాష్ట్రానికి చేసిందేమీ లేదని విమర్శించిన ఆయన, బీజేపీ , బీఆర్ఎస్ పార్టీల మధ్య 'చీకటి ఒప్పందాలు' ఉన్నాయని సంచలన ఆరోపణలు చేశారు. బీజేపీ కార్యకర్తలు తమ బీ–ఫామ్‌లను బీఆర్ఎస్ ఆఫీసుల నుండి తెచ్చుకుంటున్నారని ఎద్దేవా చేస్తూ, గల్లీలో పనిచేసే నాయకుడిని చూసి కాకుండా ఢిల్లీలో ఉండే పెళ్లి పెద్దను చూసి ఓట్లు వేయడం ఏమిటని ప్రజలను ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మంజూరైన ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును కేసీఆర్ తన స్వార్థం కోసం అటకెక్కించారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. రంగారెడ్డి జిల్లాకు 3 టీఎంసీల గోదావరి జలాలను అందిస్తే లక్షలాది ఎకరాలు సాగులోకి వచ్చేవేనని, కానీ కేసీఆర్ నిర్లక్ష్యం వల్ల జిల్లా రైతాంగం బలైపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ లక్ష కోట్లు వెచ్చించి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కేవలం మూడు ఏళ్లలోనే 'కూలేశ్వరం'గా మారిందని, ఆ ప్రాజెక్టు నిధులతో ఆయన కుటుంబ సభ్యులు ఫామ్ హౌసులు కట్టుకుని వ్యాపారాలు చేసుకున్నారని ఆరోపించారు.

## కరీంనగర్ నగరపాలక సంస్థపై

## ఈసారి కాషాయ జెండా ఎగరడం ఖాయం

### - బండి సంజయ్



కరీంనగర్, ఫిబ్రవరి 7:కరీంనగర్ నగరపాలక సంస్థపై ఈసారి కాషాయ జెండా ఎగరడం ఖాయమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇవాళ ఆయన నగరంలోని రాజస్థాన్ చౌరస్తా, లయోలా కాలేజీ, బుట్టి రాజారాం కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లలో ఆయన మాట్లాడుతూ.. ఈ ఎన్ని కల్లో ప్రతిపక్షాల పరిస్థితి దారుణంగా ఉండబోతోందని జోస్యం చెప్పారు. కరీంనగర్‌లో బీఆర్ఎస్ పనైపోయింది, వారు కేవలం 4 సీట్లకే పరిమితం కాబోతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు తెర చాటు ఒప్పందాలతో కలిసినా 20 సీట్లు కూడా దాటలేవన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో కబ్జాలకు పాల్పడిన 9 మంది కార్పొరేటర్లను అరెస్ట్ చేయించిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రజల ఆస్తుల రక్షణ బాధ్యత తనదని.. కబ్జాదారుల అంతు చూస్తానని బండి సంజయ్ ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రజల భూములను ఆక్రమించే నాయకుల భరతం పడతానని హెచ్చరించారు. తాను చచ్చి బతికి ప్రజలకు సేవ చేసేందుకే వచ్చానని, ఈ జన్మాంతం నగరం కోసం సేవకుడిలా పనిచేస్తానని భావోద్వేగానికి లోనయ్యారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తున్న నిధులతోనే కరీంనగర్ అభివృద్ధి చెందుతోందని ఆయన స్పష్టం చేశారు. అమృత్ 2.0 పథకం కింద కరీనగర్ కార్పొరేషన్‌కు రూ.132 కోట్లు మంజూరయ్యాయని, వాటితో మల్కాపూర్, చింతకుంట ప్రాంతాల్లో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

### పాకిస్థాన్‌లో మజీద్‌ను మేమే పేల్చేశాం..

## ఉగ్రవాద సంస్థ సంచలన ప్రకటన..



**ఇస్లామాబాద్,ఫిబ్రవరి 7:**పాకిస్థాన్ ఒక్కసారిగా ఉలిక్కి పడింది. బాంబుల మోతతో దద్దరిల్లిపోయింది. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌ను భయంతో కుదిపేసిన ఘోర ఘటన ఇది. శుక్రవారం నమాజ్ సమయంలో షియా మసీదులో జరిగిన ఆత్మాహుతి దాడిలో కనీసం 31 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 169 మంది వరకు గాయపడ్డారు. ఈ ఘటనకు కారణమైన ఉగ్రవాద సంస్థ ఓ సంచలన ప్రకటన విడుదల చేసింది. ఈ దాడికి తామే కారణమని ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) ఉగ్రవాద సంస్థ ప్రకటించింది. ఇస్లామాబాద్ శివారులోని తర్లాయి ప్రాంతంలో ఉన్న ఇమామ్ బర్గాహ్ ఖస్ర్–ఎ–ఖదీజతుల్ కుబ్రా మసీదులో ఈ పేలుడు జరిగింది. శుక్రవారం కావడంతో మసీదు నిండా జనాలు కిక్కిరిసిపోయారు. ప్రార్థనలు మొదలవుతున్న సమయంలోనే దుండగుడు మసీదు గేటు దగ్గర ఆత్మాహుతి పేలుడుకు పాల్పడ్డాడు. భద్రతా సిబ్బంది అతడిని ఆపే ప్రయత్నం చేసిన తరుణంలో తన శరీరానికి కట్టుకున్న బాంబును పేల్చేశాడు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన ఘటనపై 52 ఏళ్ల మహమ్మద్ కాజిమ్ అనే వ్యక్తి మాట్లాడుతూ.. "నమాజ్ మొదటి భాగంలో వంగుతున్న సమయంలో తుపాకీ శబ్దం వినిపించింది. ఆ వెంటనే భయంకరమైన పేలుడు జరిగింది" అని చెప్పాడు.

## అంతర్జాతీయ చమురు స్మగ్లింగ్ ముఠా అరెస్ట్



ముంబై, ఫిబ్రవరి 7:అరేబియా సముద్రంలో సాగుతున్న భారీ అంతర్జాతీయ చమురు స్మగ్లింగ్ రాకెట్‌ను భారత కోస్ట్ గార్డ్ సిబ్బంది శనివారం భగ్నం చేశారు. ముంబై తీరానికి పశ్చిమ దిశలో సుమారు 100 నాటికల్ మైళ్ల దూరంలో మధ్య సముద్రంలో సాహసోపేతమైన ఆపరేషన్ నిర్వహించి, అక్రమ రవాణాకు పాల్పడుతున్న నౌకలను అదుపులోకి తీసుకుంది. కోస్ట్ గార్డ్ తెలిపిన వివరాల ప్రకారం.. యుద్ధ వాతావరణం నెలకొన్న దేశాల నుండి తక్కువ ధరకు చమురును కొనుగోలు చేసి, వాటిని అంతర్జాతీయ జలాల్లోని ఇతర మోటార్ ట్యాంకర్లకు మధ్య సముద్రంలోనేబదిలీ చేయడం ఈ ముఠా ప్రధాన పని. దీని ద్వారా భారీ లాభాలను ఆర్జించడమే కాకుండా, తీరప్రాంత దేశాలకు చెల్లించాల్సిన సుంకాలను ఎగవేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ ముఠాను పట్టుకోవడంలో భారత కోస్ట్ గార్డ్ అత్యాధునిక 'టెక్–ఇంక్లూజివ్'నిఘా వ్యవస్థను వినియోగించింది. భారత ప్రత్యేక ఆర్థిక మండలి లో ఒక మోటార్ ట్యాంకర్ అనుమానాస్పదంగా తిరగడాన్ని గుర్తించిన అధికారులు.. డిజిటల్ డేటా అనాలిసిస్ ద్వారా దానితో సంబంధం ఉన్న మరో రెండు నౌకలను గుర్తించారు.ఫిబ్రవరి 5న కోస్ట్ గార్డ్ ప్రత్యేక బృందాలు ఈ నౌకలను చుట్టుముట్టి తనిఖీలు చేపట్టాయి. నౌకల్లోని ఎలక్ట్రానిక్ డేటా, పత్రాలను పరిశీలించి, సిబ్బందిని విచారించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది.

# తెలంగాణ షాన్

## సంపాదకీయం

### గర్వించదగ్గ వాగ్గేయకారుడు.....

సంగీత త్రిమూర్తులలో మూడవ వాడైన శ్యామశాస్త్రి (ఏప్రిల్ 26, 1763 – ఫిబ్రవరి 6, 1827) ప్రసిద్ధ కర్ణాటక సంగీత విద్వాంసులు. దాక్షిణాత్య కర్ణాటక సంగీత రత్న త్రయంలో వయసురీత్యా పెద్దవారు శ్యామశాస్త్రి (క్రీ. శ. 1763 –1827). శ్యామ శాస్త్రి కన్నా త్యాగరాజు కొద్దిగా చిన్నవారు (క్రీ.శ.1767 –1847). వీరు ఇరువురి కన్నా చిన్నవారు ముత్తుస్వామి దీక్షితులు (క్రీ. శ. 1776–1835). శ్యామశాస్త్రి తండ్రి విశ్వనాథ శాస్త్రి. ప్రస్తుత ప్రకాశం జిల్లాలోని గిద్దలూరుకు సమీపంలోగల కంభం ప్రాంతీయు లు. మహమ్మదీయుల దండయాత్ర లకు బెదిరి వారి కుటుంబీకులు 17వ శతాబ్దంలో తమిళనాడుకు వలస వెళ్ళి అక్కడే స్థిరపడ్డారు. శ్యామశాస్త్రి అసలు పేరు వేంకట సుబ్రహ్మణ్యము. అయితే, చిన్న తనంలో ముద్దుపేరుగా శ్యామకృష్ణ గా పిలుస్తూ, ఆ పేరే చివరకు వ్యవ హారికంలో సార్ధకమైందని ఆయన శిష్యులు పేర్కొంటారు. పుత్రుడు కలుగునని" చెప్పినట్లే ఇతనితల్లి గర్భవతిఅయి క్రీ.శ1763లో చిత్ర భాను సంవత్సరంలో మేష రవి కృత్తికా నక్షత్రమునందు శ్రీనగరమ ను తిరువారూరిలో శ్యామశాస్త్రిలు జన్మించినట్లు పేర్కొంటారు. తండ్రి విశ్వనాథ శాస్త్రి సంస్కృత, తెలుగు భాషలలొ పండితుడు కావడంతో, శ్యామశాస్త్రి చిన్న తనంలో తండ్రి దగ్గరే సంస్కృతాంధ్ర భాషలు అభ్యసించాడు. సంగీతం లో తన మేనమామ దగ్గర స్వరపరి చయం కల్గినా, ఆ పిదప తంజా వూరులో 'సంగీత స్వామి' అనబడే ప్రముఖ తెలుగు సంగీత విద్వాంసు ని దగ్గర, తంజావూరులోని రాజాస్థానంలో సంగీత విద్వాంసు డైన శ్రీ పచ్చిమిరియము ఆది అప్పయ్య సహకారంతో సంగీత శాస్త్రాలలో మర్మములు ఎన్నో అధ్యయనం చేశాడు. శ్యామ శాస్త్రి రచించిన అనేక కీర్తనలు ఉల్లాసం కలిగించేవి, చక్కని లయ, తాళ ప్రదర్శనలకు అనుగుణంగా ఉండేవి. నాదోపాసన ద్వారా ఆత్మా నందం సాధించ వచ్చని ఆయన అభిప్రాయ పడేవారు. శ్యామశాస్త్రి తెలుగు, తమిళ, సంస్కృత భాషల లో అనేక కృతులు, కీర్తనలు రచించినా అధికభాగం తెలుగులోనే వ్రాశారు. అయితే, త్యాగరాజు తన కీర్తననలో భావ రాగలకు అధిక ప్రాధాన్యత ఇవ్వగా, శ్యామశాస్త్రి కీర్తనలలో క్లిష్టమైన 'తాళ' రచన చేసినట్లు సంగీతాభిమానులు అంటారు. శ్యామశాస్త్రి కీర్తనలలో క్లిష్టమైన రచనతోపాటు, ఆయనకు శిష్యులు అధిక సంఖ్యలో లేక పోవడం వల్ల కూడా, ఈయన కీర్తనలు అధిక ప్రాచుర్యం పొంద లేదని వారు భావిస్తారు. శ్యామశాస్త్రి రచించిన "ప్రోవవ మ్మ" , "మాంజిరాగం" అలాగే 'కల్లడ '(కలగడ ), 'చింతామణి ' రాగాలు, "హిమాద్రిసుతీ " అనే కీర్తన, ఒకే స్వరంతో సంస్కృతం,తెలుగు భాషలలో వేరు వేరుగా రాసిన ఆయన కీర్తనలు సంగీత కళాకారు లందరికి సుపరిచతమే.. త్యాగరాజాదులచే కొనియాడ బడిన ఆయన లయ జ్ఞానము శ్లాఘనీయమైనది. ఆనంద భైరవి రాగమన్న ఆయనకు చాల యిష్ట మని చెప్తారు. ఆయన మదురైకు వెళ్లినపుడు మీనాక్షి దేవిని స్తుతించుచూ తొమ్మిది కృతులు ("నవరత్న మాలిక") గానం చేశాడు. శ్యామశాస్త్రి ప్రసిద్ధి చెందిన ఆనంద భైరవీ, ధన్యాసి, కల్గడ, కళ్యాణి, కాంభోజి, కాపి, చింతామణి వంటి రాగాల్లో కృతులు స్వర పరిచాడు. సంగీత పాఠాల్లో సరళీ స్వరాలు, జంట స్వరాలు, గీతాలు, స్వర జతులు, వర్ణాలు, కృతులు అనేవి ఒక పద్ధతిలో నేర్పుతారు. వీటిలో స్వరజతి రూపకర్త శ్యామశాస్త్రి. తోడి రాగంలో "రావే హిమగిరి కుమారి", భైరవి రాగంలో 'కామాక్షీ అనుదినము'వంటివి కొన్ని ప్రసిద్ధి జెందిన స్వరజతులు. ఈ స్వర జతులే కాకుండా విలోమ చాపు తాళాన్ని కూడా శ్యామశాస్త్రి బహుళ ప్రాచుర్యం లోకి తెచ్చాడు. సాధారణంగా చాపు తాళం గతి 3 + 4 పద్ధతిలో ఉంటుంది. ఇలా కాకుండా 4 + 3 రీతిలో తాళ గతిని మార్చి కొన్ని కీర్తనలు స్వర పరిచా డు. పూర్వి కళ్యాణి రాగంలో 'నిన్ను వినగ మరి', ఫరజ్ రాగంలో 'త్రిలోక మాత నన్ను' అనేవి ఈ విలోమ చాపు తాళంలో ప్రసిద్ది చెందిన కీర్తనలు. శ్యామశాస్త్రి ప్రసిద్ధి చెందిన ఆనంద భైరవీ, ధన్యాసి, కల్గడ, కళ్యాణి, కాంభోజి, కాపి, చింతామణి వంటి రాగాల్లో కృతులు స్వర పరిచాడు. సంగీత పాఠాల్లో సరళీ స్వరాలు, జంట స్వరాలు, గీతాలు, స్వర జతులు, వర్ణాలు, కృతులు అనేవి ఒక పద్ధతిలో నేర్పుతారు. వీటిలో స్వరజతి రూపకర్త శ్యామశాస్త్రి.తంజావూరు జిల్లాలో తిరువా యూరులో ఉన్న కామాక్షి దేవాల య అర్చకత్వం చేసుకుంటూ, తన గాన కళా పాండిత్యంలో కామాక్షి అమ్మవారి సేవలో, ఆమె సన్ని ధానం లోనే 'శ్యామకృష్ణ' అనే ముద్రతో అనేక కీర్తనలు, కృతులు రచించాడయన. శ్యామశాస్త్రి ఇంటి ఇలవేల్పుగా కామాక్షిదేవిని కీర్తిస్తూ, తమ ఇంటి 'ఆడపడుచుగా' అమ్మవారిని భావిస్తూ ? అపూర్వం, అనన్య సామాన్య కృతులెన్నింటినో శ్యామ శాస్త్రి రచించాడని ఆయన శిష్యులు, సంగీత కళారాధకులు పేర్కొంటారు. అందువల్లనే, శ్యామ శాస్త్రి తన కీర్తనలలో కొన్నింటిని "శ్యామకృష్ణ – సహోదరి" అని పేర్కొన్నట్లు వారు చెపుతారు. శ్యామశాస్త్రి కుమారుడు సుబ్బరాయ శాస్త్రి కూడా ప్రముఖ వాగ్గేయకారిడిగా ప్రసిద్ది చెందాడు. శ్రీ అలసూరు కృష్ణయ్య , శ్రీ తలగం బాడి పంచనాదయ్య తదితరులు శ్యామశాస్త్రి శిష్యులలో ప్రముఖులు.

## సిట్ దారెటు...దొరకని సాక్ష్యాలు...



**హైదరాబాద్, ఫిబ్రవరి 8 :** ప్రస్తుతం రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్‌పై జరుగుతున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ.. ఓ పొలిటికల్ డ్రామానేనా!? అంటే, అవుననే రాజకీయ విశ్లేషకు లు, సాంకేతిక రంగ, న్యాయ నిపుణుల నుంచి సమాధానం వస్తోంది. అంతిమంగా ఇదంతా ఒక పొలిటికల్ డ్రామా లాగా మిగిలిపోతుందని రాజకీయ విశ్లేషకులు కుండబ ద్దలు కొట్టినట్టుగా చెబుతుండటంతో.. సిట్ విచారణ కూడా పొలిటికల్ డ్రామాగా మారబోతుందా అనే అనుమానాలు బలపడుతు న్నాయి. అనుమానమేలేదు, జరిగేది ఇంతే అని ఆయా రంగాల నిపుణులు, రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏవైనా.. ప్రత్యర్థులు, ప్రతిపక్షాలు, ప్రధాన నేతలు.. ఇలా అనేక మందికి సంబంధించిన ఫోన్లను ట్యా పింగ్ చేయడం ద్వారా ముందుగానే వారి ఆలోచనలను తెలుసుకుంటాయి. తద్వారా వారికి అడ్డుకట్ట వేసేందుకు వీలుగా వ్యూహా లు పన్ని.. ప్రతిపక్ష నేతలు, కీలక ప్రజాప్రతినిధులు, ప్రత్యర్థులకు చెక్ పెట్టడానికి 'నిఘా' వ్యవస్థలను వాడుకుంటున్నాయనే విమర్శ లు ఉన్నాయి.అయితే ఇది కేవలం బీఆర్ఎస్ ప్రభుత్వానికే పరిమితం కాదు.. అనేక రాష్ట్రాల్లో, ఆఖరికి కేంద్రంలోనూ ఇలాగే నిఘా పెట్టే అవకాశాలు కూడా ఉంటాయని నిపుణులు చెబుతుండటం గమనార్హం. అం టే ఇక్కడా, అక్కడా అనే తేడా లేకుండా ప్ర భుత్వాలు ఇలాంటి వ్యవహారాలను గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తుంటాయని స్పష్టమవుతున్నదిఇలాంటి ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాలను నడిపించడానికి అత్యంత అధునాతన సాంకేతికత, పరికరాలు కావాల్సి ఉంటుంది. తా జా సంఘటనలో 'పెగాసస్' సాంకేతికతను వాడినట్టుగా చెప్పుకుంటున్నారు. ఇలాంటి సాంకేతికత, పరికరాలు ఇజ్రాయెల్‌లో లభిస్తుంటాయి. అయితే, ఇలాంటి పరికరాలను ఏ ప్రభుత్వం కూడా అధికారికంగా తెప్పించుకోజాలదని నిపుణులు అంటున్నారు.ట్యాపింగ్‌కు ఉపయోగించే పరికరాలను ఇతర పేర్లతో తెప్పించుకుని, కస్టమ్స్ చెల్లించి మరీ ఉపయోగిస్తారని తెలుస్తుంది. అంటే.. ఎక్కడా కూడా ఈ పరికరాలకు సంబంధించిన అధికారిక రికార్డులు ఉండవనే నిఘా వర్గాల నిపుణులు చెబుతున్నారు. ఇంత చేస్తున్నా.. ఏ ప్రభుత్వం కూడా బహిరంగంగా తాము ఇలా నిఘా పెట్టామనే విష యాన్ని చెప్పుకోలేవుఇలా అత్యాధునిక సాంకేతికతో కూడిన పరికరాల ఉపయోగించి.. ఎవరికి సంబంధించిన సమాచారం కావాలనేది పైస్థాయిలో ఉండేవారు ఆదేశిస్తారు. కిందివారు దానిని పాటించి సమాచారాన్ని సేకరిస్తారు. ఇలా సేకరించిన సమాచారాన్ని కూడా అధికారిక పత్రాల్లో కాకుండా.. సాధారణ కాగితాలపై, చిన్న స్లిప్‌లపై పంపిస్తారు. ఇలా వచ్చిన సమాచారం చూసుకున్న తరువాత.. సదరు పైస్థాయి నేతలు, అధికారులు ఆ కాగితాన్ని లేదా.. సమాచారం వచ్చిన దానిని కాల్చిపారేస్తారని నిఘా వర్గాల్లో పనిచేసే నిపుణులు చెబుతున్నారు.దీనివల్ల అటు ఎవరు ఆదేశించారనేది తెలియదు.. ఆ సమాచారం ఏమిటనేది కూడా మిగలదు. దీనితో ఇదంతా కేవలం డ్రామాగా మిగులుతుందని నిఘా వర్గాల నిపుణులు విశ్లేషి స్తున్నారు. ఇప్పుడు జరుగుతున్న సిట్ విచారణలో కూడా ఏ సమాచారం.. ఎవరి గురిం చి.. ఎప్పుడు కావాలని ఎవరు ఆదేశించారనేది తెలియదు. సీఎం నుంచి కిందిస్థాయి పోలీసు కానిస్టేబుల్ వరకు దీనిని ఎవరూ నిర్ధారించలేదు. అలాగే వచ్చిన సమాచారం ఏమిటనేది ఎక్కడా రికార్డులు ఉండవు. ఫైళ్లు అసలే ఉండవు. అంటే అది నిజమని చెప్పే ఒక్క సాక్ష్యం కూడా లేదనే చెప్పవచ్చు. కేసు ఇక కోర్టులో ఏం నిలుస్తుంది.? అని విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు.వాస్తవానికి ప్రభుత్వం గతంలో జరిగిన సంఘటనలకు, ఫోన్ ట్యాపింగ్‌పై సిట్ వేసి విచారణ చేయిస్తోంది. ఇప్పుడు విచారణలో ఏం తేలినా.. అప్పట్లో ప్రతిపక్ష నేతలు, ముఖ్యమైన ప్రజాప్రతినిధులు, ప్రత్యర్థులు ఏం చేశారనే సమాచారం కూడా ఇప్పుడు విచారణ ఎదుర్కొంటున్న వారికి తెలిసి ఉంటుందని.. అయితే బయటపెట్టలేని పరిస్థితుల్లో ఉండటంతో వాటికీ విలువ ఉండదని విశ్లేషకులు అంటున్నారు.ఇప్పుడు విచారణ చేయిస్తున్న ప్రభుత్వానికి కూడా సమాచారం తెలిసినా.. ఏం చేయలేని పరిస్థితే ఉంటుందని.. వారంటున్నారు. ఇలా రెండు పక్షాలు కూడా కేవలం రాజకీయ డ్రామాను రసవత్తరంగా నడిపించడానికే విమర్శలు, ప్రతివిమర్శలు చేస్తుంటారని వారంటున్నారు.వాస్తవానికి తాజాగా బీజేపీ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు రాంచందర్‌రావు ఒకానొక సందర్భంలో మాట్లాడుతూ.. ఫోన్ ట్యాపింగ్‌పై సిట్ విచారణ అనేది ఉత్తిదేనని.. ఇప్పటి వరకు ఎందుకు ఒక్కరిని కూడా ఈ కేసులో అరెస్టు చేయలేదని విమర్శించడం గమనార్హం. అయితే విచారణలే తప్పితే.. అరెస్టులు ఉంటాయనే సూచనలు కూడా కనపడటం లేదు. అంటే ప్రతిపక్ష నేతలు చేస్తున్న విమర్శలు నిజమనే అనుమానాలు బలపడుతున్నాయి.

## మున్సిపల్ ఎన్నికల్లో ట్రయాంగిల్ ఫైట్



**కరీంనగర్, ఫిబ్రవరి 8 :** తెలంగాణ వ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి అదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో రాజకీయం పూర్తిగా కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ గా మారిపోయింది. పార్లమెంట్ ఎన్నికల నాటి నుంచి కొనసాగుతున్న జోరును మున్సిపల్ కేంద్రాల్లోనూ ప్రదర్శించి, పట్టణ ఓటర్లపై పట్టు సాధించాలని బీజేపీ వ్యూహరచన చేస్తోంది. మరోవైపు, అధికార యంత్రాంగం అండతో పాటు గ్యారెంటీల అమలును ప్రచార అస్త్రంగా చేసుకుని కాంగ్రెస్ ఇక్కడ జైత్రయాత్ర కొనసాగించాలని చూస్తోంది. దక్షిణ తెలంగాణలో మాత్రం త్రిముఖ పోటీ కనిపిస్తోంది. దక్షిణ తెలంగాణ ప్రాంతాలైన ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో రాజకీయ వాతావరణం భిన్నంగా ఉంది. ఇక్కడ కాంగ్రెస్‌కు బలమైన క్యాడర్ ఉండగా, బీఆర్ఎస్ తన పట్టును కాపాడుకోవడానికి గట్టిగా పోరాడుతోంది. ఈ ప్రాంతంలో నల్గొండ, కొత్తగూడెం, మహబూబ్‌నగర్ వంటి 3 కార్పొరేషన్లతో పాటు పెద్ద సంఖ్యలో మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇక్కడ బీజేపీ కూడా తన ప్రాబల్యాన్ని పెంచుకోవాలని చూస్తుండటంతో పోరు త్రిముఖంగా మారింది. ప్రస్తుత ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో క్షేత్రస్థాయిలోకి వెళ్తోంది. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులే తమకు అండగా నిలుస్తారని భావిస్తున్న హస్తం పార్టీ, దాదాపు అన్ని వార్డుల్లోనూ అభ్యర్థులను నిలబెట్టి బలమైన ఉనికిని చాటుతోంది. అయితే, అధికారాన్ని అడ్డం పెట్టుకుని ప్రత్యర్థులను అణచివేస్తున్నారనే ఆరోపణలను కాంగ్రెస్ ఎదుర్కొంటోంది. ముఖ్యంగా దక్షిణ తెలంగాణలోని తన కంచుకోటలను కాపాడుకోవాలన్న పట్టుదలతో ఉంది. బీజేపీ కేంద్ర నిధుల వినియోగం, హిందూత్వ ఎజెండా,స్థానిక సమస్యలపై ఛార్జ్‌షీట్ల విడుదల ద్వారా దూకుడుగా ప్రచారం చేస్తోంది. పట్టణ ఓటర్లు తమవైపే ఉన్నారనే ధీమాతో అర్బన్ ఏరియాల్లో కమలం జెండా ఎగురవేయాలని చూస్తోంది. ఇదే సమయంలో, బీఆర్ఎస్ ఈ ఎన్నికలను తమ మనుగడకు అత్యంత కీలకంగా భావిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో చేసిన పట్టణ ప్రగతి పనులను వివరిస్తూ, కేటీఆర్ , హరీష్ రావు నేతృత్వంలో కేడర్‌ను సమాయత్తం చేస్తోంది. త్రిముఖ పోటీ జరుగుతున్న ప్రధాన పోటీ కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యనే దక్షిణ తెలంగాణలో సాగుతోంది. దక్షిణ తెలంగాణ మున్సిపాలిటీల్లో పార్టీల కంటే అభ్యర్థుల ఎంపిక, రెబెల్స్ ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. టికెట్ దక్కని నాయకులు స్వతంత్రులుగా బరిలోకి దిగడం అన్ని పార్టీలకూ తలనొప్పిగా మారింది. ఓట్లు చీలితే అది ఎవరికి లాభిస్తుందనేది అంచనాలకు అందడం లేదు. ఈ మున్సిపల్ ఎన్నికలు కేవలం స్థానిక సంస్థలకే పరిమితం కాకుండా, రాష్ట్రంలో బలమైన ప్రత్యామ్నాయం ఎవరు అనే ప్రశ్నకు సమాధానం ఇవ్వబోతున్నాయి. ఉత్తర తెలంగాణలో బీజేపీ తన పట్టును నిరూపించుకుంటే, రాష్ట్ర రాజకీయాల్లో కాంగ్రెస్‌కు ప్రధాన ప్రత్యర్థిగా నిలుస్తుంది. లేకపోతే బీఆర్ఎస్ తన స్థానాన్ని కాపాడుకుంటుంది. అందుకే హోరాహోరీగా ప్రయత్నాలు చేస్తోంది.

## జంట నగరాలుగా ఆ రెండు సిటీస్



**వరంగల్, ఫిబ్రవరి 8 :** మున్సిపల్ ఎన్నికలు ఈనెల 11న జరగనున్నాయి. దీంతో రాష్ట్రంలో మెజారిటీ మున్సిపాలిటీలను తన ఖాతాలో వేసుకోవాలని అధికార కాంగ్రెస్ భావిస్తోంది. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రచారరంగంలోకి దిగారు. ఫిబ్రవరి 4న మిర్యాల గూడలో ప్రచారం నిర్వహించారు. ఇక ఫిబ్రవరి 5న కరీంనగర్ జిల్లాలో ప్రచారం నిర్వహించారు. చొప్పదండిలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం కీలక ప్రకటన చేశారు. భవిష్యత్ ప్రణాళికలో కరీంనగర్, వరంగల్ జంటనగరాలుగా మారాలని ఆకాంక్షించారు. ఔటర్ రింగ్‌రోడ్ నిర్మాణం, మామునూరు విమానాశ్రయం ఆధునీకరణలతోపాటు, రెండు ప్రాంతాల మధ్య పెద్ద విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉన్నట్లు తెలిపారు. ఇది మౌలిక సదుపాయాల కల్పనతోపాటు స్థిరమైన అభివృద్ధికి మార్గం సుగమం చేస్తుందని తెలిపారు.వరంగల్, కరీనగర్ మధ్యలో భారీ డంపింగ్ యార్డు నిర్మించి, అక్కడ నగర వ్యర్థాలను విద్యుత్‌గా మార్చే ప్రణాళిక దేశవ్యాప్తంగా మార్గదర్శకంగా మారుతుందని సీఎం తెలిపారు. ఇలాంటి వేస్ట్?టు?ఎనర్జీ ప్రాజెక్టులు నీటి సమస్యలను తగ్గించి, విద్యుత్‌ను పెంచుతాయి. మున్సిపల్ కార్పొరేషన్ల అభివృద్ధితోపాటు, ఈ చొరవ గ్రీన్ ఎనర్జీ మోడల్‌గా పనిచేస్తూ, ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిగా నిలుస్తుంది. ఫలితంగా, స్థానిక సమాజాలకు శుభ్రత, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.విమానాశ్రయం, రింగ్ రోడ్‌తో కలిసి ఈ జంట నగరాలు ఆకర్షణీయ పెట్టుబడి కేంద్రాలుగా మారతాయి. వ్యాపారం, పటకం, ఉత్పాదక రంగాలు ఊపందుకుని, ఉద్యోగాలు సృష్టించే అవకాశం ఉంది. అయితే, భూమి సేకరణ, ఆర్థిక భారం వంటి సవాళ్లను అధిగమించాలి. విజయం కోసం ప్రభుత్వం, ప్రైవేటు భాగస్వామ్యాలు అవసరం. దీర్ఘకాలంలో, తెలంగాణ పట్టణాలలో అభివృద్ధి అసమానతలు తగ్గుతాయి.ప్రభుత్వ బడ్జెట్, కేంద్ర సహాయం, స్థానిక సహకారం ఈ ప్రాజెక్టుల వేగాన్ని నిర్ణయిస్తాయి. ఇప్పటికే విజయవంతమైన హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ ఆధారంగా, ఇక్కడ కూడా సామర్థ్యవంతమైన ప్రణాళికలు ఫలిస్తాయి. మొత్తంగా, ఈ చొరవ తెలంగాణను ఆధునిక రాష్ట్రంగా రూపొందిస్తూ, గ్రామీణ?పట్టణ సమతుల్యతను సాధిస్తుంది.

## నువ్వా, నేనా అన్నట్టు ప్రచారం

**వికారాబాద్, ఫిబ్రవరి 8 :** రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు రసవత్తరంగా సాగుతున్నాయి. రంగారెడ్డి జిల్లా మెయినాబాద్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ కు ఎదురీత తప్పడం లేదు. రాష్ట్రంలో అధికారంలో ఉన్నామన్న ధీమా ఉందో లేక అభ్యర్థుల్లో గెలుపుపై నమ్మకం సన్నగిల్లిందో తెలియదు కానీ మొయినాబాద్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి నానాటికీ తీసికట్టుగా మారుతోంది.ఎన్నికల నగారా మోగి, ప్రచారం హోరెత్తాల్సిన సమయంలో కాంగ్రెస్ అభ్యర్థులు కనీసం ఇంటి గడప దాటకపోవడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్గా మారింది. మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థుల జాడ కనిపించడం లేదు. ప్రత్యర్థి పార్టీలు ఇంటింటి ప్రచారంతో దూసుకుపోతుంటే, కాంగ్రెస్ అభ్యర్థులు మాత్రం కనీసం ఓటర్లను కలిసే ప్రయత్నం కూడా చేయడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో సామాన్య ఓటర్లలో అసలు కాంగ్రెస్ పోటీలో ఉందా? లేక ముందే చేతులెత్తేసిందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.క్షేత్రస్థాయిలో పార్టీ గ్రాఫ్ పడిపోతుండటంతో అప్రమత్తమైన ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగి పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నారు. వరుస సమావేశాలు నిర్వహిస్తూ కార్యకర్తల్లో జోష్ నింపేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ, అభ్యర్థుల్లో కదలక లేకపోవడం ఆయనకు కూడా తలనొప్పిగా మారింది. నాయకులు మేకప్ వేస్తున్నా, క్షేత్రస్థాయిలో 'సీన్' మాత్రం రివర్స్లో ఉండటం గమనార్హం.పార్టీ అంతర్గత వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం.. దీని వెనక ప్రధానంగా మూడు కారణాలు వినిపిస్తున్నాయి.అంతర్గత కుమ్ములాటలు... టికెట్ల కేటాయింపులో జరిగిన జాప్యం, అసంతృప్త నేతల సహాయ నిరాకరణ పార్టీని దెబ్బతీస్తోంది. మరో పక్క నాయకత్వ లోపం తేట తెల్లమవుతుంది. స్థానిక నాయకుల మధ్య సమన్వయం లేకపోవడంతో క్యాడర్ ఎటు వెళ్లాలో తెలియక అయోమయంలో ఉంది.గెలుపుపై ధీమా లేకపోవడంతో అభ్యర్థులు ఖర్చు పెట్టేందుకు వెనకాడుతున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. నాయకులు ఏసీ రూముల్లో సమావేశాలు పెడితే ఓట్లు రావు, ప్రజల్లోకి వస్తేనే ఫలితం ఉంటుంది అని కాంగ్రెస్ సానుభూతిపరులే బహిరంగంగా వ్యాఖ్యానిస్తుండటం గమనార్హం.మొత్తానికి మొయినాబాద్ మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకోవాలనుకున్న కాంగ్రెస్ కల, ప్రస్తుత 'ప్రచారలోపం' చూస్తుంటే కల్లగానే మిగిలిపోయేలా ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. తక్షణమే వ్యూహం మార్చకపోతే 'చేయి' జారిపోవడం ఖాయంగా కనిపిస్తోంది.

## యాగంటి ఉమామహేశ్వర స్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దాం

### : మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

**కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 8 :** ఈ నెల 14 నుంచి 18 వరకు అత్యంత ఘనంగా జరిగే యాగంటి శ్రీ ఉమా మహేశ్వర స్వామి దేవస్థానం మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర ఆర్ అండ్ బి శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సూచించారు. శుక్రవారం యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఆర్ అండ్ బి శాఖ మంత్రి బీసీ జనార్ధనరెడ్డి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం జరిగింది. అంతకు ముందు ఆయన భక్తుల వాహన సౌకర్యాలకు సంబంధించి వాహనాల పార్కింగ్ కోసం నూతనంగా చేపట్టిన పార్కింగ్ స్థలాన్ని, బండలాగుడు పందెల ఏర్పాట్లకు సంబంధించిన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం యాగంటి క్షేత్రానికి వచ్చి ఆలయ సాంప్రదాయం ప్రకారం ఆలయంలోకి వెళ్లి స్వామివార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు వేదపండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. అనంతరం నిర్వహించిన సమీక్షా సమావేశంలో బనగానపల్లె ఇంచార్జి ఆర్డీవో నరసింహులతో కలిసి బనగానపల్లె మండలానికి చెందిన వివిధ శాఖల అధికారులు, పాలక మండలి సభ్యులతో బ్రహ్మోత్సవ ఏర్పాట్లకు సంబంధించి సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు సూచనల మేరకు అత్యంత వైభవంగా యాగంటి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నామనిశ్రీశైలం, మహానంది తర్వాత యాగంటి ఆలయానికి అంతటి ప్రాముఖ్యత ఉందని, కర్ణాటక, తెలంగాణలతో పాటు రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి భక్తులు విచ్చేస్తారని వారిని సంతృప్తి కలిగించే విధంగా ఏర్పాట్లు ఉండాలన్నారు.భక్తుల సౌకర్యార్థం తీసుకుంటున్న భద్రతా చర్యలు, క్యూలైన్లలో భక్తుల దర్శనం కోసం తీసుకుంటున్న చర్యలపై పలు సూచనలు చేశారు. శివరాత్రికి యాగంటికి వచ్చే భక్తులకు ఆరోజున టోల్ గేట్ ఫీజు వసూలు రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. సొంత నిధులతో భక్తులకు ఉచిత లడ్డూ ప్రసాదం అందజేయనున్నట్లు మంత్రి తెలిపారు.బ్రహ్మోత్సవాల రద్దీ నేపథ్యంలో అదనపు ఆర్టీసీ సర్వీసులను ఏర్పాటు చేయాలని,ఆలయ ప్రాంగణంలో తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని, భారీగా వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా క్యూలైన్లు ఏర్పాటు చేయాలని మంత్రి అన్నారు.ఆలయ ప్రాంగణం మొత్తం పారిశుద్ధ్యంగా ఉండేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు.బ్రహ్మోత్సవాల నిర్వహణ విషయంలో ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో భక్తులకు ఎలాంటి అసౌకర్యం రాకుండా చూడాలని అన్నారు. ప్రధానంగా క్యూలైన్ ఏర్పాట్లు, పారిశుద్యం, వైద్యం, ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. భక్తులకు ఆరోగ్యపరమైన సేవలు అందించే విషయంలో లోటుపాట్లు రాకుండా చూడాలని ఆదేశించారు. యాగంటి క్షేత్ర ఆయకట్టు గ్రామాల ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉత్సవాల రోజుల్లో ప్రత్యేక దర్శనం పేరిట దూరప్రాంతలనుంచి వచ్చే భక్తులకు ఇబ్బంది పెట్టవద్దని ప్రతి ఒక్కరు క్యూలైన్ ద్వారానే స్వామివారిని దర్శించుకోవాలని కోరారు. ఈ సమీక్షా సమావేశంలో బనగానపల్లె ఇంచార్జి ఆర్డీవో కేపీ నరసింహులు,ఆలయ ఈవో పాండురంగారెడ్డి, ఆలయ చైర్మన్ బండి చంద్ర మౌళీశ్వరరెడ్డి ఎమ్మార్వో బత్తుల నారాయణ రెడ్డి, సిఐ ప్రవీణ్ కుమార్ వివిధ శాఖల అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బందిపాల్గొన్నారు.యాగంటిలో మంత్రి బీసీ జనార్ధనరెడ్డి ప్రత్యేక పూజలుశుక్రవారం యాగంటి దేవస్థానంలో జరిగిన బ్రహ్మోత్సవాల సమీక్ష సమావేశంలో పాల్గొనేందుకు విచ్చేసిన రాష్ట్ర ఆర్ అండ్ బి శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి యాగంటి ఉమామహేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి ఆలయానికి చేరుకోగానే ఆలయ ఈవో డి పాండురంగారెడ్డి, ఆలయ చైర్మన్ బండి మౌళీశ్వర రెడ్డి, ఆలయ సంప్రదాయం ప్రకారం వేదమంత్రోచ్ఛరణాల మధ్య స్వాగతం పలికారు.

## జగిత్యాల కాంగ్రెస్ లో ముసలం

**కరీంనగర్ ఫిబ్రవరి 8 :** జగిత్యాల కాంగ్రెస్‌లో ముదిరిన ముసలం ఇప్పుడు తెలంగామ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. దశాబ్దాలుగా పార్టీ జెండాను మోసిన సీనియర్ నేత జీవన్ రెడ్డి ఆవేదన, ప్రస్తుత రాజకీయ సమీకరణాలు కాంగ్రెస్ అధిష్టానానికి కొత్త తలనొప్పులు తెచ్చిపెడుతున్నాయి.తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి జగిత్యాల ఒకప్పుడు కంచుకోట. ఆ కోటను కాపాడుతూ వస్తున్న సీనియర్ నేత టి. జీవన్ రెడ్డి ప్రస్తుత పరిస్థితుల్లో తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. మున్సిపల్ ఎన్నికల వేళ టికెట్ల కేటాయింపులో జరిగిన పరిణామాలు, బీఆర్ఎస్ నుంచి వచ్చిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు ప్రాధాన్యత పెరగడం జీవన్ రెడ్డిని కన్నీటి పర్యంతం చేశాయి.గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున గెలిచిన సంజయ్ కుమార్, ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరినట్లు వార్తలు వచ్చాయి. అయితే, సాంకేతిక కారణాల దృష్ట్యా తాను పార్టీ మారలేదని, కేవలం అభివృద్ధి కోసం ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నానని ఆయన పేర్కొంటున్నారు. ఇటీవల స్పీకర్ కూడా ఆయనపై అనర్హత పిటిషన్‌ను తిరస్కరించడంతో సంజయ్ కుమార్ తన పట్టును మరింత పెంచుకున్నారు.మరోవైపు, కాంగ్రెస్ కష్టకాలంలో ఉన్నప్పుడు జెండా మోసిన తమను కాదని, నిన్నగాక మొన్న వచ్చిన వారికి ప్రాధాన్యత ఇవ్వడంపై జీవన్ రెడ్డి వర్గం భగ్గుమంటోంది. మున్సిపల్ టికెట్ల పంపిణీలో సంజయ్ వర్గానికి 30 సీట్లు, జీవన్ రెడ్డి వర్గానికి కేవలం 20 సీట్లు కేటాయించడమే ఈ మంటలకు ఆజ్యం పోసింది.జీవన్ రెడ్డి తాజాగా చేసిన వ్యాఖ్యలు పార్టీలో పెద్ద దుమారాన్నే రేపుతున్నాయి. గతంలో రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు "పార్టీ మారిన ఎమ్మెల్యేలను రాళ్లతో కొట్టండి" అని పిలుపునిచ్చారని గుర్తు చేస్తూ, ఇప్పుడు తాను మాత్రం "రాళ్లతో కాదు.. ఓటు అనే ఆయుధంతో కొడదాం" అని అనడం విశేషం. ఇది ప్రత్యక్షంగా పార్టీ అధిష్టానంపై ఆయన చేస్తున్న తిరుగుబాటుగా విశ్లేషకులు భావిస్తున్నారు.పార్టీ కోసం దశాబ్దాలుగా శ్రమించిన తన అనుచరులకు అన్యాయం జరిగిందని జీవన్ రెడ్డి భావోద్వేగానికి గురయ్యారు. "జీవితం ముగిసే సమయంలో నాకు ఇంత దుఃఖం తెప్పించారు. నా గొంతు కోయాలంటే ముందు నా కార్యకర్తలను దాటి రావాలి" అని ఆయన చేసిన వ్యాఖ్యలు జగిత్యాల కాంగ్రెస్ శ్రేణుల్లో కల్లోలం రేపుతున్నాయి. తన వర్గానికి చెందిన అభ్యర్థులు స్వతంత్రులుగా బరిలోకి దిగడం, వారికి జీవన్ రెడ్డి మద్దతు తెలపడం పార్టీ అధికారిక అభ్యర్థుల గెలుపుపై ప్రభావం చూపే అవకాశం ఉంది.మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించాలని భావిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి, జగిత్యాల సంక్షోభం పెద్ద తలనొప్పిగా మారింది. ఒకవైపు సీనియర్ నేత గౌరవం, మరోవైపు అధికార బలాన్ని పెంచుకునే క్రమంలో చేర్చుకున్న ఎమ్మెల్యేల మధ్య సమన్వయం కుదరకపోవడం పార్టీని ఇబ్బందుల్లో నెట్టేస్తోంది.జగిత్యాల మున్సిపల్ ఎన్నికల ఫలితాలు కేవలం స్థానిక నాయకత్వాన్నే కాదు, రాష్ట్రస్థాయిలో కాంగ్రెస్ అంతర్గత ప్రజాస్వామ్యాన్ని, పార్టీ ఫిరాయింపుల వల్ల కలిగే నష్టాలను కూడా తేటతెల్లం చేయనున్నాయి. జీవన్ రెడ్డి లాంటి సీనియర్ నేతను బుజ్జగించకపోతే, అది రాబోయే రోజుల్లో ఇతర జిల్లాల్లోనూ అసమ్మతి రాగాలకు దారితీసే ప్రమాదం ఉంది.

# ప్రమాదవశత్తు మరణించిన ఉద్యోగులకు కోటి రూపాయల ప్రమాద బీమా



కాప్రా ఫిబ్రవరి 7

రోడ్డు ప్రమాదంలో ప్రమాదవశాత్తు మరణించినఉద్యోగులకుటుంబాలకు టి.జి.ఎస్.ఆర్టీసీ భరోసాఉచిత ప్రమాద బీమా ద్వారా కుటుంబానికిరూ.కోటి ఆర్థిక సహాయంసంస్థ సిబ్బందికి అక్కరకొస్తున్న యూబీఐ సూపర్ సాలరీ సేవింగ్అకౌంట్ఉద్యోగులకు అండగా ఉంటామన్న సంస్థ ఎండీ శ్రీ వై. నాగిరెడ్డి, ఐ.పి.ఎస్ రోడ్డు ప్రమాదంలో విషాదం అలుముకున్న కుటుంబానికి టీజీఎస్ఆర్టీసీ అండగా నిలిచింది. వివిధ సమయాలలో విధి వంచించి అకాల మృత్యువు వెంటాడిన ఇద్దరు డ్రైవర్స్ కుటుంబాలకు ఆర్థిక సాయాన్ని అందించి భరోసా కల్పించింది. కుషాయిగూడ, ఉప్పల్ డిపోలకు చెందిన డ్రైవర్స్ వెంకటేశ్, డి.ఆర్.గౌడ్లు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఇంటికి పెద్ద దిక్కు మృతి చెందడంతో బాధిత డ్రైవర్ల కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.ఈ ఆపద సమయంలో యూబీఐ సూపర్ శాలరీ సేవింగ్ అకౌంట్ బాధిత కుటుంబాలకు అక్కరకొచ్చింది. ఆర్థిక ప్రయోజనంతో కూడిన సూపర్ సాలరీ సేవింగ్ అకౌంట్ కలిగి ఉండటంతో ఉచిత ప్రమాద బీమా పథకం వర్తించింది. సంస్థలోని ఉద్యోగులందరూ వారు నివసిస్తున్న ప్రాంతాల్లోని యూబీఐ బ్రాంచీల్లో సంస్థ సూచించిన ఖాతాను తెరిచి రూపే కార్డులను తీసుకున్నారు. ఈ ఖాతా ద్వారా ఉచిత ప్రమాద బీమా సౌకర్యం ఉండటంతో ఉద్యోగులకు ఎంతో ఆర్థిక ప్రయోజనం చేకూరుతోంది. ప్రమాదాలు జరిగిన సమయంలో సూపర్ సాలరీ సేవింగ్ అకౌంట్ కింద యూబీఐ రూ. కోటి అందజేస్తోంది.ఈ మేరకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలు రూ. కోటి విలువైన చెక్కులను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇ.డి అమ్రేష్ ప్రసాద్, వారి సిబ్బంది తో కలిసి సంస్థ వీసీ అండ్ ఎండీ వై.నాగిరెడ్డి, ఐ.పి.ఎస్ శనివారం బస్సు భవన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేరు వేరు సమయాలలో జరిగిన ఈ రోడ్డు ప్రమాద ఘటనలో కుషాయిగూడ డిపో డ్రైవర్ మరణించడం . తమ తప్పు ఏమీ లేకపోయినా రోడ్డు ప్రమాదంలో డ్రైవర్స్ అకాల మరణం చెందటం దురదృష్టకరమన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి సంస్థ అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు గుర్తు చేశారు. పోషణలో పెద్ద దిక్కు కోల్పోయిన కుటుంబ సభ్యులకు సంస్థ అండగా నిలుస్తుందని, ఆత్మ స్థైర్యం, ధైర్యం కోల్పోకుండా ఉండేందుకు బాధిత కుటుంబానికి ఉచిత ప్రమాద బీమా సౌకర్యం ఎంతో ఉపకరిస్తుందన్నారు.కొన్ని పథకాలు ఆపద సమయంలో అక్కరకు వస్తాయని, ఇందుకు ఇదే ఉదాహరణ అని, వాటిని వినియోగించుకోవడంలో ఎట్టి పరిస్థితుల్లోనూ అలసత్వం వహించకూడదని సూచించారు. ఈ అవకాశాన్ని కల్పించిన యూబీఐకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.డ్రైవర్ ఎ. వెంకటేష్ తన ఇంటి నుండి విధుల కోసం కుషాయిగూడ డిపోకు ఉదయం ద్విచక్ర వాహనంపై వస్తుండగా కీసర సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఈ యొక్క కార్యక్రమంలో కుషాయిగూడ డిపో మేనేజర్ వి వేణుగోపాల్ బస్ భవన్ సిబ్బంది పాల్గొన్నారు

# కాలనీ సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తా

## -ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ

కాప్రా ఫిబ్రవరి 7

డాక్టర్ ఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని కాలనీ లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు.శనివారం డాక్టర్ ఎస్ రావు నగర్ డివిజన్ లో 14 కోట్ల రూపాయల నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్థానిక కార్పొరేటర్ శిరీష సోమ శేఖర్ రెడ్డి గారితో కలిసి శంకుస్థాపన చేశారు.

**వివిధ కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణం**

2.దెబ్బతిన్న బీటీ రోడ్ల మరమ్మతులు ఠ రీ--కార్పెటింగ్

3.అనుపురం కాలనీ, భవానీ నగర్, శ్రీనగర్ కాలనీ తదితర **ప్రాంతాల్లో రోడ్డు అభివృద్ధి**

4.ఆర్వోసీ బాక్స్ డ్రెయిన్ నిర్మాణం -- భవానీ నగర్ రోడ్ నుండి ఈటిడిసి వరకు

5.శాంతివనం శ్మశానవాటిక అభివృద్ధి పనులు

6.మహేశ్ నగర్ గ్రౌండ్, విరాట్ నగర్ పార్కులలో వాకింగ్ ట్రాకఓచైన్ లింక్ ఫెన్సింగ్ పార్క్ సౌకర్యాలు

7.దక్షిణ కమల నగర్‌లోకంపౌండ్ వాల్ మరమ్మతులుఓపెన్ జిమ్



**బతుకమ్మ మడుగు ఏర్పాటు**

ఈ అభివృద్ధి పనుల ద్వారా వార్డు--15లో మౌలిక సదుపాయాలు మరింత మెరుగుపడనున్నాయి.ఈ కార్యక్రమంలో దీ=హా పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు గారు దీ=హా పార్టీ డివిజన్ అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి , దీ=హా పార్టీ నాయకులు కార్యకర్తలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జవహర్ నగర్ పిఎస్ పరిధిలో వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు వ్యక్తుల అదృశ్యం..





**జవహర్ నగర్ తెలంగాణ షాన్, ఫిబ్రవరి 07:**

జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు వ్యక్తులు అదృశ్యమైనట్లు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఒకరు వ్యాపారవేత్త కాగా, మరొకరు డిగ్రీ చదువుతున్న విద్యార్థిని.ఇన్స్పెక్టర్ సైదయ్య తెలిపిన వివరాలు ప్రకారం.. కౌకూర్, ప్రశాంత్ విహార్ కాలనీలో నివాసముండే ముతబోయిన కృష్ణ ప్రదీప్ రాజ్ (45) అనే వ్యాపారవేత్త ఈ నెల 2వ తేదీన ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. మరుసటి రోజు వస్తానని చెప్పిన ఆయన కోసం కుటుంబ సభ్యులు అన్ని చోట్లా వెతికినా ఆచూకీ లభించలేదు. అయితే, గత కొంతకాలంగా తన భర్తకు గుర్తుతెలియని వ్యక్తుల నుండి బెదిరింపు ఫోన్ కాల్స్ వస్తున్నాయని, ఆ భయం కారణంగానే ఆయన అదృశ్యమై ఉండవచ్చని భార్య రూప సంతోషి ఫిర్యాదులో వివరించారు. బాధితుడు 5.2 అడుగుల ఎత్తు ఉండి, తెలుగు, హిందీ, తమిళం మరియు ఇంగ్లీష్ భాషలు మాట్లాడగలరని చెప్పారు.

**తల్లి ఫోన్ తీసుకుని వెళ్లిన విద్యార్థిని..**

మరో ఘటనలో గిరిప్రసాద్ నగర్‌కు చెందిన పొన్నగంటి సోనీ (20) అనే డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థిని అదృశ్యమైంది. ఈ నెల 7వ తేదీన మధ్యాహ్నం సమయంలో ఇంటి నుండి బయటకు వెళ్లిన ఆమె, తన తల్లి మొబైల్ ఫోన్‌ను వెంట తీసుకెళ్లింది. తన కుమార్తె గతంలో ఒక అపరిచిత వ్యక్తితో ఫోన్‌లో మాట్లాడేదని, ఆ కోణంలోనే ఆమె వెళ్లిపోయి ఉండవచ్చని తల్లి స్వరూప పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదృశ్యమైన సమయంలో సోనీ ఆకుపచ్చ రంగు దుస్తులు ధరించి ఉన్నట్లు సమాచారం అందించారు.ఈ రెండు ఘటనలపై జవహర్ నగర్ పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఓలా, ఉబర్, రాపిడోలకు వ్యతిరేకంగా జవహర్ నగర్‌లో ఆటోల బంద్

## - ఐక్యమత ఆటో యూనియన్ ఆధ్వర్యంలో శాంతియుత నిరసన

**జవహర్ నగర్ తెలంగాణ షాన్, ఫిబ్రవరి 07:** జవహర్ నగర్ సర్కిల్‌లో ఆల్ ఇండియా ఆటో మరియు మోటార్ వర్కర్ల పిలుపు మేరకు, కార్పొరేట్ రవాణా సంస్థలైన ఓలా, ఉబర్, మరియు రాపిడోల విధానాలకు వ్యతిరేకంగా శనివారం జవహర్ నగర్ లో ఆటో డ్రైవర్లు చేపట్టిన సమ్మె విజయవంతమైంది. ఐక్యమత ఆటో యూనియన్ ఆధ్వర్యంలో డ్రైవర్లు తమ ఆటోలను నిలిపివేసి శాంతియుత రీతిలో నిరసన వ్యక్తం చేశారు.?ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు కట్ట కృపవరం, ప్రధాన కార్యదర్శి కూరాకుల నర్సింగ్ మాట్లాడుతూ.. యాప్ ఆధారిత రవాణా సంస్థల వల్ల సామాన్య ఆటో డ్రైవర్ల జీవనోపాధి ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా బైక్ టాక్సీల వల్ల నిబంధనలకు విరుద్ధంగా రవాణా సాగుతోందని, దీనివల్ల ఆటో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని వారు పేర్కొన్నారు.ఈ నిరసన కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు కె. అనిల్, కె. అజయ్ లతో పాటు కృష్ణ మూర్తి, ఆర్. శంకర్, డి. రాజసేన, కె. మారుతి, సలీమ్, సమీర్, బాలరాజు, కిషోర్, నాగార్జున మరియు పెద్ద సంఖ్యలో జవహర్ నగర్ ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.




# జవహర్ నగర్ 'సంతోష్' నగర్‌లో నరకప్రాయం : మురుగునీటిలోనే మునిగి తేలుతున్న జనం!

## - కాలువల్లేని రోడ్లు.. జేబులు నింపుకున్న నాయకులు: మురుగునీటి కుంటగా సంతోష్ నగర్!

## - 'సంతోష్' లేని సంతోష్ నగర్: విషసర్పాలు, విద్యుత్ షాక్‌ల నీడలో సామాన్యుడి ప్రాణం!







**జవహర్ నగర్ తెలంగాణ షాన్, ఫిబ్రవరి 07:** జవహర్ నగర్ జిహెచ్ఎంసి సర్కిల్ పరిధిలోని పేరుకేమో అది 'సంతోష్' నగర్.. కానీ అక్కడ నివసిస్తున్న ప్రజలకు మాత్రం సంతోషం కరువై ఏళ్లు గడుస్తోంది. జవహర్ నగర్ సర్కిల్ పరిధిలోని సంతోష్ నగర్‌లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారవ్వడంతో స్థానికులు నరకయాతన అనుభవిస్తున్నారు. వర్షాకాలం మొదలైన నాటి నుండి నేటి వరకు పరిస్థితులు ఏమాత్రం మారకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

?నడుము లోతు నీరు.. పట్టించుకోని పాలకులు ?గత కొన్ని నెలలుగా కురుస్తున్న వర్షాలకు తోడు, సరైన డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో మురుగునీరు రోడ్ల పైనే నిలిచిపోయింది. కొన్ని చోట్ల నడుము లోతు వరకు మురుగునీరు చేరి చెరువులను తలపిస్తోంది. చిన్న పిల్లలు, వృద్ధులు బయటకు రావాలంటేనే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా క్షేత్రస్థాయిలో ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.ముంచుకొస్తున్న ముప్పు,రోగాల బారిన పడుతున్న ప్రజలు రోడ్లపై నిలిచిన మురుగునీటి వల్ల దోమలు, ఈగలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీనివల్ల డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు వ్యాపిస్తాయని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అంతేకాకుండా, విషసర్పాల భయం,మురుగునీటితో పాటు విషపూరితమైన పాములు, క్రిమికీటకాలు ఇళ్లలోకి చేరుతున్నాయి.

ట్రాన్స్‌ఫార్మర్ ముప్పు,నీటిలోనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మునిగి ఉండటంతో ఏ నిమిషానికి ఏం జరుగుతుందోనని స్థానికులు వణికిపోతున్నారు. విద్యుత్ షాక్ తగిలే ప్రమాదం ఉన్నా అధికారులు మొద్దునిద్ర వీడటం లేదని ప్రజలు మండిపడుతున్నారు.

కమిషన్ల కక్కుర్తి.. అవినీతి రోడ్లు! ముందుచూపు లేకుండా, కేవలం కమిషన్ల కోసమే పనులు చేస్తున్నారని నాయకులపై స్థానికులు ధ్వజమెత్తుతున్నారు. డ్రైనేజీ కాలువలు నిర్మించకుండానే సిసి రోడ్లు వేయడం వల్లే నేడు ఈ దుస్థితి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేవలం తమ జేబులు నింపుకోవడానికే ప్రాధాన్యత ఇస్తున్న నాయకులకు ప్రజల ప్రాణాలంటే లెక్కలేకుండా పోయిందని వాపోతున్నారు.?జోనల్ కమిషనర్ చొరవ తీసుకోవాలి. వినతిపత్రాలు ఇస్తే బుట్టదాఖలు చేయడం అధికారులకు అలవాటుగా మారిందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జిహెచ్ఎంసి మల్కాజిగిరి జోనల్ కమిషనర్ స్పందించి, సంతోష్ నగర్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు వేడుకుంటున్నారు. తక్షణమే డ్రైనేజీ వ్యవస్థను ప్రక్షాళన చేసి, ప్రజలను ప్రమాదాల నుండి కాపాడాలని డిమాండ్ చేస్తున్నారు.

# రోజుల్లోనే 800 మందికిపైగా మిస్సింగ్

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 8 :** ఢిల్లీలో మిస్సింగ్ కేసులు ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ ఏడాది మొదటి 15 రోజుల్లోనే 500మందికిపైగా మహిళలు, బాలికలు సహా 800 మది ఆచూకీ లేకుండాపోయారు. ఇవేవో ప్రతిపక్షాలు, హక్కుల సంఘాలు చేస్తున్న ఆరోపణలు కాదు. పోలీసుల రికార్డులే ఇవి చెబుతున్నాయి. జనవరి 1 నుంచి 15 మధ్య నమోదయిన మిస్సింగ్ కేసుల్లో కేవలం 235 మంది ఆచూకీ గుర్తించారు. ఇక, తప్పిపోయిన వారిలో ఎక్కువ శాతం వయోజనులే ఉన్నారు.అయితే, అదృశ్యమైనవారిలో 235 మంది ఆచూకీని పోలీసులు గుర్తించారు. మిగతా 572 మంది ఏమయ్యారో తెలియరాలేదని పోలీసుల రికార్డులు చూపుతున్నాయి. అలాగే, కనిపించకుండాపోయిన మొత్తం కేసుల్లో 191 మంది మైనర్లు ఉండటంతో బాలల భద్రతపై ఆందోళనను ఇది ఎత్తిచూపుతోంది. వీరిలో ఎక్కువ మంది బాలికలే (145 బాలికలు, 45 మది బాలురు) కావడం మరింత కలవరానికి గురిచేస్తోంది. తప్పిపోయిన మైనర్లలో ఎక్కువ మంది టీనేజర్లు ఉన్నారు. ఈ కాలంలో 169 మంది టీనేజర్లు తప్పిపోయినట్లు గుర్తించారు. వారిలో 138 మంది బాలికలు, 31 మంది బాలురు. ఈ టీనేజర్ కేసులలో దాదాపు 71 శాతం ఇప్పటికీ పరిష్కారం కాలేదని పోలీసు డేటా సూచిస్తుంది.అలాగే, 8 నుంచి 12 ఏళ్లలోపు పిల్లలు 13 మంది అదృశ్యమయ్యారు. వీరిలో ఎనిమిది మంది అబ్బాయిలు, ఐదుగురు అమ్మాయిలు ఉన్నారు. ఎనిమిదేళ్లలోపు పిల్లలు 9 మంది ఆచూకీ కానరాలేదు. వీరిలో ఆరుగురు చిన్నారులను పోలీసులు రక్షించారు. జాడలేని వ్యక్తులలో వయోజనులే అత్యధిక సంఖ్యలో ఉన్నారు. 363 మంది మహిళలు, 253 మంది పురుషులతో సహా మొత్తం 616 మంది వయోజనులు అదృశ్యమైనట్లుగా గుర్తించారు. వీరిలో 181 మంది జాడను పోలీసులు గుర్తించగా.. 435 కేసులు ఇంకా అపరిష్కృతంగా ఉన్నాయి.తాజా గణాంకాలు రాజధానిలో నెలకొన్న దీర్ఘకాలిక ధోరణిని ప్రతిబింబిస్తున్నాయి. గతేడాది ఢిల్లీలో 24,500కు పైగా మిస్సింగ్ కేసులు నమోదయ్యాయి, వీరిలో 60 శాతానికి పైగా మహిళలే ఉన్నారు. దశాబ్దల గణాంకాల విశ్లేషణ ప్రకారం.. గత 10 ఏళ్లలో నగరంలో దాదాపు 2.3 లక్షల మంది అదృశ్యమయ్యారు, వీరిలో సుమారు 52,000 కేసులు ఇంకా పరిష్కారం కాకుండానే ఉన్నాయి.

# ఓటర్లపై పవన్ ముద్ర సాధ్యమేనా

**హైదరాబాద్, ఫిబ్రవరి 8 :** తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగడంతో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య హోరాహోరీ పోరు సాగుతున్న తరుణంలో, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎంట్రీతో ఎన్నికల ముఖచిత్రం ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా మంగళగిరి వేదికగా జరిగిన కీలక సమావేశం, బీజేపీ–జనసేన మైత్రి తెలంగాణ గడ్డపై ఏ మేరకు ప్రభావం చూపుతుందనే చర్చకు తెరలేపింది.మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయంలో తెలంగాణ జనసేన ముఖ్య నేతలతో పవన్ కల్యాణ్ సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో పార్టీ ఉపాధ్యక్షుడు బొంగునూరి మహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, ఇంచార్జి శంకర్ గౌడ్ వంటి కీలక నేతలు పాల్గొన్నారు.ఈ భేటీలో పవన్ ప్రధానంగా మూడు అంశాలపై దృష్టి సారించారు. జనసేన పోటీ చేస్తున్న స్థానాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. అలాగే క్షేత్రస్థాయిలో బీజేపీ కార్యకర్తలతో కలిసి పనిచేయాలని నేతలకు సూచించారు. ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉండటం, బీఆర్ఎస్ తన ఉనికిని చాటుకోవడానికి ప్రయత్నిస్తుండటంతో బీజేపీ కొంత ఒత్తిడిలో ఉన్న మాట వాస్తవం. ఈ క్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు.. పవన్ కల్యాణ్‌ను కలిసి మద్దతు కోరడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. పవన్ కేవలం తన పార్టీ అభ్యర్థులకే కాకుండా, బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం కూడా ప్రచారం చేస్తానని ప్రకటించడం కమలం పార్టీకి కొండంత అండగా మారింది.పవన్ కల్యాణ్ ప్రచార నిర్ణయం వ్యూహం దాగిఉందని భావిస్తున్నారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో పవన్ కల్యాణ్‌కు భారీ ఫాలోయింగ్ ఉంది. మున్సిపల్ ఎన్నికలు పట్టణ ఓటర్లతో ముడిపడి ఉన్నందున, ఆయన ప్రచారం యువతను, సినీ అభిమానులను పోలింగ్ బూత్‌ల వైపు నడిపించే అవకాశం ఉంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలతో పాటు జనసేన కూడా ప్రభావం చూపితే, ఓట్ల చీలిక ఎవరికి నష్టం చేస్తుందనేది ఆసక్తికరం. గతంలో జనసేన పోటీ చేయని చోట్ల ఓట్లు ఇతర పార్టీలకు మళ్లగా, ఇప్పుడు ఆ ఓట్లు జనసేన–బిజెపి కూటమికి పడే అవకాశం ఉంది. క్షేత్రస్థాయిలో వెనుకబడినట్లు కనిపిస్తున్న బీజేపీ కార్యకర్తలకు పవన్ రాక కొత్త ఉత్సాహాన్ని ఇస్తుంది. కిషన్ రెడ్డి వంటి సీనియర్ నేతల విజ్ఞప్తి మేరకు పవన్ స్పందించడం, భవిష్యత్తులో ఈ రెండు పార్టీల పొత్తు మరింత బలపడుతుందనే సంకేతాలను ఇస్తోంది.ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఆయన నిర్వహిస్తున్న అధికారిక బాధ్యతలు, కీలక సమీక్షా సమావేశాల వల్ల సమయం కేటాయించడం కుదరలేదని తెలుస్తోంది. ఏపీలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి కొన్ని అత్యవసర ప్రాజెక్టుల తుది గడువు ఉండటం, అలాగే సనాతన ధర్మ రక్షణకు సంబంధించి ఆయన చేపట్టిన ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాల బిజీ కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. అలాగే భారీ జనసందోహం వచ్చే అవకాశం ఉండటంతో, భద్రతా ఏర్పాట్లు , ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని స్థానిక యంత్రాంగం నుంచి అనుమతుల విషయంలో కొన్ని సాంకేతిక ఇబ్బందులు తలెత్తినట్లు సమాచారం. రాజకీయ కారణాలు కూడా ఉన్నట్లుగా తెలుస్తోంది. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల తరపున ప్రచారం చేసేందుకు పవన్ కల్యాణ్ రావడాన్ని కాంగ్రెస్ నేతలు తీవ్రంగా విమర్శించారు. ఏపీలో అధికారంలో ఉండి, తెలంగాణ ప్రయోజనాల విషయంలో స్పష్టత లేని పవన్.. ఇక్కడ ఏ ముఖం ఎట్టుకుని ప్రచారం చేస్తారని వారు ప్రశ్నించారు. గతంలో తెలంగాణను అవమానించారని ఆరోపించారు. ఈ విమర్శలపై జనసేన గట్టిగానే స్పందించింది. పవన్ కల్యాణ్ ఒక జాతీయ భావజాలం ఉన్న నాయకుడని, రెండు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు కోరుకునే వ్యక్తిని విమర్శించడం సరికాదని పార్టీ నేతలు హితవు పలికారు. కేవలం రాజకీయ విద్వేషాలను రెచ్చగొట్టడానికే ప్రతిపక్షాలు ఇలాంటి విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఇక ఈ విమర్శల వల్లే ప్రచారం ఆగిపోయిందా అన్న చర్చపై రాజకీయ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. విమర్శలు రావడం సహజమే అయినా, అవే ప్రచారం రద్దుకు ప్రధాన కారణం కాదని జనసేన వర్గాలు అంటున్నాయి. ఏపీలో పాలనాపరమైన ఒత్తిడి, భద్రతా కారణాలు, పొత్తులో భాగంగా క్షేత్రస్థాయిలో బీజేపీ–జనసేన క్యాడర్ మధ్య సమన్వయ లోపం వంటి అంశాలే పర్యటన రద్దుకు దారితీసినట్లు తెలుస్తోంది. ప్రత్యర్థుల విమర్శలకు భయపడి వెనక్కి తగ్గే నాయకుడు పవన్ కల్యాణ్ కాదని, కేవలం అనివార్య కారణాల వల్లే ఈ నిర్ణయం తీసుకున్నారని పార్టీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. మొత్తానికి పవన్ ప్రచారం మాత్రం ఆగిపోయింది.



# కాపు కాస్తామంటున్న వైసీపీ సామాజిక లెక్కల్లో జగన్ టీమ్



**గుంటూరు, ఫిబ్రవరి 8 :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కొత్త రాజకీయ దారులను వెతుకుతున్నారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఆయన ఆలోచనలు సాధారణ విశ్లేషణలకు భిన్నంగా ఉంటాయని, ఓటమి తర్వాత మరింత జాగ్రత్తగా వ్యూహాలు సిద్ధం చేసుకుంటున్నారని అనుచరులు అంటున్నారు. రాజకీయాల్లో ఓడిన చోటే తిరిగి బలం పెంచుకోవడం ఒక సంప్రదాయం. జగన్ కూడా అదే మార్గాన్ని ఎంచుకుని, పాత పద్ధతులకు బదులుగా కొత్త వ్యూహాలపై నమ్మకం పెట్టుకున్నట్లు కనిపిస్తోంది. వైసీపీ ఓటమికి కారణమైన రాజకీయ, సామాజిక పరిణామాలను ఆయన లోతుగా అధ్యయనం చేస్తున్నారని ఇటీవల ఆయన ప్రసంగాలు సూచిస్తున్నాయి. ఈ వ్యూహాల్లో మాజీ మంత్రి అంబటి రాంబాబు) పాత్ర కీలకంగా మారుతోంది. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్నప్పటికీ ఆయనకు మంత్రి పదవి దక్కేందుకు మూడున్నర దశాబ్దాలు పట్టింది. వైఎస్సార్ అనుచరుడిగా కాంగ్రెస్‌లో పనిచేసినా, ఉమ్మడి ఏపీలో ఎమ్మెల్యేగా గెలవలేకపోవడం ఆయన రాజకీయ ప్రయాణాన్ని నెమ్మదింపజేసింది. అయితే వైసీపీ ఏర్పడ్డాక జగన్ ఆయనకు ప్రాధాన్యత ఇచ్చారు. 2022లో మంత్రి పదవి ఇవ్వడమే కాకుండా, తాజాగా కాపులలో "టైగర్" అంటూ బిరుదు ఇచ్చి ముందుకు తెచ్చారు. జగన్ రాజకీయ లెక్కల్లో కాపు సామాజిక వర్గం ముఖ్యంగా కనిపిస్తోంది. 2019 ఎన్నికల్లో వైసీపీ గెలుపులో వారి మద్దతు కీలకంగా నిలిచింది. అప్పట్లో ముద్రగడ పద్మనాభం (ఉద్యమం కూడా కలిసివచ్చి, గోదావరి జిల్లాలు ( వైసీపీకి బలంగా మారాయి. కానీ 2024 నాటికి పరిస్థితి పూర్తిగా మారింది. పవన్ కళ్యాణ్ రూపంలో కాపులకు బలమైన నాయకుడు రావడం, ఆయన చంద్రబాబు నాయుడు తో జట్టు కట్టడం వల్ల రాజకీయ సమీకరణలు తారుమారు అయ్యాయి. ఈ మార్పుతో వైసీపీకి ఎదురుదెబ్బ తగిలింది. ఈ నేపథ్యంలో అంబటి రాంబాబు ఘటనను జగన్ వ్యూహాత్మకంగా ఉపయోగించుకుంటున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది. అంబటి కుమార్తె మౌనిక మీడియాతో మాట్లాడుతూ తమపై అధికార దుర్వినియోగం జరుగుతోందని ప్రశ్నించడం కాపు వర్గాల్లో చర్చకు దారి తీసింది. జనసేన మద్దతుతో అధికారంలోకి వచ్చిన టీడీపీ ) తమపైనే బలప్రయోగం చేస్తుందా అనే సందేహాన్ని ఆమె వ్యక్తం చేశారు. ఇది నేరుగా రాజకీయ నేతలకు కాకపోయినా, కాపు సమాజంలో భావోద్వేగాలను రేకెత్తించడానికే అన్న విశ్లేషణ ఉంది. గుంటూరు జిల్లాలో జగన్ పర్యటన సమయంలో కాపు జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో స్పందన కనిపించిందని అంటున్నారు. అంబటి రాంబాబు భవిష్యత్తులో తన సామాజిక వర్గాన్ని ఎంతవరకు పోలరైజ్ చేయగలుగుతారన్నది కీలక ప్రశ్నగా మారింది. వంగవీటి రంగా అనుచరుడిగా గతంలో కాపునాడు కార్యక్రమాల్లో పనిచేసిన నేపథ్యం ఆయనకు ఉంది. ఇప్పుడు వైసీపీ ఆయనను ముందుకు తెస్తూ కొత్త గుర్తింపునివ్వాలని చూస్తోంది. అంబటి విడుదల తర్వాత ఆయనకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలన్న ఆలోచన కూడా పార్టీ వర్గాల్లో ఉంది. కూటమి వర్సెస్ అంబటి అంశం రాబోయే రోజుల్లో మరింత వేడెక్కే అవకాశముంది. ఈ మొత్తం వ్యవహారంలో జగన్ వేసిన అడుగు వ్యూహాత్మకమా కాదా అన్నది రాజకీయ ఫలితాలే తేల్చాలి.

**అంబాసిడర్ స్థాయికి అంబటి**

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ప్రమోషన్ పొందాలన్నా.. పదవులు దక్కించుకోవాలని అనుకున్నా ప్రత్యర్థి పార్టీల నాయకుల మీద బూతులతో విరుచుకుపడాలి. ఆయా పార్టీల నేతల ఇళ్లపై కర్రలతో దాడులకు దిగాలి. లేకుంటే నిత్యం జగన్మోహన్ రెడ్డికి వీర విధేయుడుగా ఉంటూ ఆయన నామస్మరణ చేయాలి. ఆయన అడుగులకు మడుగులు వత్తాలి. అప్పుడే వారికి పదవులు లభిస్తాయి. పిలిచి మరి పదవులు కట్టబెడతారు. వైయస్సార్ కాంగ్రెస్ ఐదేళ్ల హయాంలో జరిగింది కూడా అదే. ఏదైనా మంత్రి పదవి నిర్వర్తిస్తే వారి శాఖలో ప్రగతి చూస్తారు. కానీ వైసీపీ హయాంలో శాఖల ప్రగతి కంటే ప్రత్యర్థులపై బూతులతో విరుచుకుపడే మంత్రులే అధికం. కొడాలి నాని కి తొలి మూడేళ్లు పదవి ఇచ్చారు జగన్. చంద్రబాబుతో పాటు లోకేష్ పై విరుచుకు పడనిదే పొద్దు గడవదు అన్నట్టు ఉండేది కొడాలి నాని పరిస్థితి. ఆ స్థాయిలో జగన్మోహన్ రెడ్డిని మెప్పించారు కనుక కొడాలి నానికి మంత్రి పదవి దక్కింది. ఏకంగా పౌరసరఫరాల శాఖ మంత్రిగా అవకాశం కల్పించారు. అంతెందుకు జోగి రమేష్ విషయంలో కూడా అదే జరిగింది. ఆయన చంద్రబాబు ఇంటి మీదకు కర్రలతో దాడికి తెగబడినందుకే జోగి రమేష్ కు ఏకంగా గృహ నిర్మాణ శాఖ మంత్రిగా క్యాబినెట్ లో చోటు కల్పించారు జగన్మోహన్ రెడ్డి. సొంత సామాజిక వర్గాన్ని జగన్ కోసం కించపరిచారు పేర్ని నాని ఇక అంబటి రాంబాబు గురించి చెప్పనవసరం లేదు. అప్పటికీ ఇప్పటికీ ఆయన నోరు అదుపులోకి రావడం లేదు. పోసాని కృష్ణ మురళి అయితే పవన్ కళ్యాణ్ తో పాటు ఆయన కుటుంబాన్ని నీచాతి నీచంగా దూషించారు. ఏకంగా ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కించుకున్నారు. ఇక రోజా గురించి చెప్పనవసరం లేదు. రోజా గురించి చెప్పనవసరం లేదు. బూతు సైగలతో,, చిల్లర మాటలతో ప్రత్యర్థులను రెచ్చగొట్టేవారు. రెచ్చిపోయేవారు. అందుకు ఆమె పర్యాటక శాఖ మంత్రి పదవి పొందారు. ఇలా జగన్ కోసం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో రాజకీయ హద్దులు చెరిపేసి దిగజారి ప్రవర్తించిన ప్రతి ఒక్కరికి పదవులు దక్కాయి. ఇప్పుడు అంబటి రాంబాబుకు ఏ స్థాయిలో ప్రమోషన్ దక్కుతుందో చూడాలి.

# వైసీపీకి వరుస షాకులు



**నెల్లూరు, ఫిబ్రవరి 4 :** ఏపీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలకు వరుస షాకులు తగులుతున్నాయి. తాజాగా మరో ఇద్దరు నేతలపై కేసులు నమోదయ్యాయి. మాజీ మంత్రి విడదల రజిని, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి పోలీసులు నోటీసులు అందించారు. సీఎం చంద్రబాబు, సోమిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాకాణిపై కేసులు నమోదు కాగా.. పోలీసులు నోటీసులు ఇచ్చారు. కాకాణి ఇంటికి వెళ్లి నోటీసులు అందజేశారు. ఏపీ రాజకీయాలు హాట్ హాట్‌గా సాగుతున్నాయి. తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి కేసు అధికార, విపక్ష పార్టీల మధ్య నిప్పు రాజేసింది. దీంతో మాటల తూటాలు, ఇళ్లపై దాడులు, కేసులు.. ఇలా ఏపీ రాజకీయం మొత్తం వేడెక్కిపోయింది. ఈ క్రమంలోనే విపక్ష వైసీపీ నేతలకు వరుస షాకులు తగులుతున్నాయి. ఇప్పటికే మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్ మీద కేసులు నమోదు కాగా.. తాజాగా మరికొందరు మాజీ మంత్రులు కూడా కేసులు, నోటీసులతో ఉక్కిరిబిక్కిరయ్యే పరిస్థితి. తాజాగా మాజీ మంత్రి విడదల రజినీపై కేసు నమోదైంది. జనవరి 30వ తేదీన విడదల రజిని అనుచరులు, టీడీపీ నాయకుల మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో టీడీపీ నేతలు విడదల రజినీపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా యడ్లపాడు పోలీసులు విడదల రజినితో పాటుగా 21 మంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలపై కేసు నమోదు చేశారు. మరోవైపు వైసీపీ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి పోలీసులు నోటీసులు ఇచ్చారు. కాకాణి ఇంటికి వెళ్లిన పోలీసులు.. ఆయనకు నోటీసులు అందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ టీడీపీ నేతలు చేసిన ఫిర్యాదు ఆధారంగా.. కాకాణిపై కేసులు నమోదయ్యాయి. నెల్లూరు గ్రామీణం, మనుబోలు, పొదలకూరులో కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలోనే విచారణకు రావాలంటూ కాకాణి గోవర్ధన్ రెడ్డికి పోలీసులు నోటీసులు ఇచ్చారు. అటు వినుకొండ మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత బొల్లా బ్రహ్మనాయుడుపైనా కేసు నమోదైంది. వినుకొండ పోలీసులు బొల్లా బ్రహ్మనాయుడు మీద కేసు నమోదు చేశారు. జనవరి 31వ తేదీ వినుకొండలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో బొల్లా బ్రహ్మనాయుడు, ఇతర వైసీపీ నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తోపులాట జరగ్గా.. ఓ కానిస్టేబుల్‌ను వైసీపీ నేతలు తోసేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనలో కానిస్టేబుల్ గాయపడినట్లు చెప్తున్నారు. ఈ కానిస్టేబుల్ ఫిర్యాదు ఆధారంగానే బొల్లా బ్రహ్మనాయుడుతో పాటుగా 27 మంది వైసీపీ నేతలపై వినుకొండ పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్లాన్ వర్కౌటవుతుందా

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆశించిన స్థాయిలో ప్రజల నుంచి స్పందన రావడం లేదు. తమ పార్టీ నేతలపై దాడులకు తెగబడుతున్నారని జగన్మోహన్ రెడ్డి చెప్పుకొచ్చారు. అయితే గతంలో జగన్ ఇలాంటి దాడుల విషయంలో వ్యవహరించిన తీరును ఇప్పటికీ ప్రజలు గుర్తు చేస్తున్నారు. వారికి గుర్తు లేకపోతే సోషల్ మీడియా గుర్తు చేస్తోంది. బీపీలు వస్తే పార్టీ కార్యకర్తలు, అభిమానులు దాడి చేస్తారు అన్న జగన్ మాటను ఎక్కువ మంది గుర్తు చేస్తున్నారు. అప్పట్లో టిడిపి నేత ఒక్కరూ బోస్ డీకే అనే పదాన్ని వాడారు. దానిని విచిత్రమైన బూతుగా మార్చారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు. చివరకు జగన్మోహన్ రెడ్డి అదే మాటను వక్రీకరిస్తూ.. తనను అంత మాట అంటే అభిమానులకు బీపీ వచ్చి ఆ టిడిపి నేత ఇంటిపై పడ్డారని.. అందులో ఎంత మాత్రం తప్పు లేదని తేల్చేశారు. ఇప్పుడు మాజీ మంత్రి అంబటి రాంబాబు మీడియా సమక్షంలో, పోలీసుల సమక్షంలో చంద్రబాబుపై బూతు పదం ప్రయోగించారు. ఇప్పుడు కూడా బీపీ వచ్చింది అని చంద్రబాబు ప్రకటించలేదు. ఎంతవరకు ఆయన సంమయమనం పాటించమని పార్టీ శ్రేణులను కోరేరే తప్ప ఇలా సమర్థించలేదు. అయితే తాజా పరిణామాలతో జగన్ వైఖరిని మరోసారి ప్రజల ముందు ఉంచుతోంది సోషల్ మీడియా. అయితే ఈ ఘటనతో పొలిటికల్ సెంటిమెంటు రగిలించాలని వైసీపీ భావించింది. కానీ దానికి ఎంత మాత్రం ప్రజలు అవకాశం ఇవ్వడం లేదు. మొన్నటికి మొన్న కల్తీ మద్యం వ్యవహారం జరిగింది. ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చేలా వైసీపీ నేతలే ప్లాన్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ప్రధానంగా మాజీ మంత్రి జోగి రమేష్ పేరు బయటకు వచ్చింది. ఈ కుట్రలో ఆయన భాగస్వామ్యం అయ్యారని నిర్ధారణ కావడంతో కోర్టు రిమాండ్ విధించింది. ఆ కేసు విచారణ అలా కొనసాగుతుండగానే ఆయన బెయిల్ పై బయటకు వచ్చారు. ఇప్పుడు అదే నేత నిత్యం లోకేష్ పై విరుచుకు పడుతూనే ఉన్నారు. అంబటి రాంబాబు కంటే దారుణంగా వ్యాఖ్యానాలు చేశారు. అయితే జోగి రమేష్ ఇంటి పై దాడి జరిగింది. కానీ ప్రజల నుంచి మాత్రం సానుభూతి లభించడం లేదు. అంబటి రాంబాబు ఇంటిపై దాడి విషయంలో కూడా ప్రజలు లైట్ తీసుకుంటున్నారు. ఎందుకంటే ఆ ఇద్దరు నేతలు అత్యంత వివాదాస్పదులే. ఈ ఘటనల ద్వారా వైసీపీ రాజకీయ లబ్ధి పొందాలనుకోవడం అంటే అంతకంటే మూర్ఖత్వం ఉండదు. వారి వల్ల మరింత చెడ్డ పేరు వస్తుందే కానీ.. ప్రజలు మాత్రం గుర్తించే ఛాన్స్ లేదు. దానిని జగన్ గుర్తించడం లేదు. ఏదైనా ప్రజా సమస్యలపై పోరాటం చేయవచ్చు కదా. సీనియర్ నేతలను ముందు పెట్టి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించవచ్చు కదా? అయితే దానిని వదిలేసి ఇలా అంబటి రాంబాబు, జోగి రమేష్ లాంటి వారితో రాజకీయాలు చేయాలనుకోవడం మూర్ఖత్వమేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రజలు ఇటువంటి వారితో రాజకీయం చేస్తామంటే హర్షించరంటున్నారు. ఎందుకంటే రాజకీయాల్లో వీరు వ్యవహరించిన తీరు తెలిసినదే. అధికారంలో ఉన్నప్పుడు వీరు ఎంతలా తెగించి, దూకుడుగా వ్యవహరించారో తెలియనిది కాదు. అటువంటివారితో రాజకీయాలు చేయడం ఎంత మాత్రం సహేతుకం కాదని పార్టీలో సీనియర్ నేతలు సైతం అభిప్రాయపడుతున్నారు. కానీ జగన్మోహన్ రెడ్డి వారిద్దరిపై ఆధారపడి, ఆ రెండు ఘటనలపై పోరాటం ప్రారంభించడం అనేది నిజంగా సాహసమే.

# ఇక పెళ్లిళ్లే.. పెళ్లిళ్లు..



**హైదరాబాద్ :** తెలుగు రాష్ట్రాల్లో జరగాల్సిన అనేక వివాహ వేడుకలు, శుభకార్యాలు, ఫంక్షన్‌లకు మూఢం కారణంగా బ్రేక్ పడింది. అయితే, ఇప్పుడు మళ్లీ శుభగడియలు తరుముకొస్తున్నాయి. దాదాపు మూడు నెలల విరామం తరువాత తెలుగు రాష్ట్రాల్లో మళ్లీ పెండ్లిళ్ల బాజాలు మోగబోతున్నాయి. నవంబర్ నెల నుంచి మూఢాల కారణంగా శుభ ముహూర్తాలు లేకుండా పోయాయి. శుక్ర మౌఢ్యమి ఈనెల 17న ముగియడంతో తెలుగు రాష్ట్రాల్లో మూడు నెలల తరువాత పెళ్లిళ్లు, రిసెప్షన్లతో కల్యాణ మండపాలు మళ్లీ కళకళలాడనున్నాయి. మన పంచాగాల ప్రకారం.. ఫిబ్రవరి 19వ తేదీ నుంచి శుభముహూర్తాలు ప్రారంభం అవుతున్నాయి. 19, 20, 21, 24, 25, 26తేదీలు వివాహాలకు అనుకూలంగా ఉన్నాయి. 19, 20, 21 తేదీల్లో గృహ ప్రవేశాలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. ఫిబ్రవరి 21వ తేదీన ఎక్కువ పెళ్లిళ్లు జరగనున్నాయి. ఆ రోజు పంచమి మరీ మంచి ముహూర్తం కావడం, అలాగే వీకెండ్ కావడం కారణంగా భారీ సంఖ్యలో వివాహాలకు ముహూర్తాలను నిర్ణయించుకున్నట్లు పండితులు చెబుతున్నారు. ఫిబ్రవరి నెల తరువాత మార్చి, ఏప్రిల్, మే, జూన్, జులై వరకు అన్నీ మంచి రోజులే ఉన్నాయని పురోహితులు చెబుతున్నారు. మార్చి నెలలో 4, 5, 6, 7, 8, 11, 12, 13, 14, 20, 21, 25, 29 తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్నాయి. అదేవిధంగా ఏప్రిల్ నెలలో 1 నుంచి 8వ తేదీ వరకు.. ఆ తరువాత 10, 11, 12, 21, 25, 26, 28, 29, 30 తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్నాయి. మే నెలలో 1, 3, 5, 6, 7, 8, 9, 10, 12, 13 తేదీల్లో.. జూన్ నెలలో 19, 20, 21, 24, 25, 26, 27, 28 తేదీల్లో, జులై నెలలో 1, 2, 3, 5, 8, 9 తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్నట్లు చెబుతున్నారు. ఫిబ్రవరి నెల నుంచి మార్చి, ఏప్రిల్, మే, జూన్ , జులై నెలల్లో కూడా వరుసగా శుభ ఘడియలు ఉండటంతో పురోహితులు, వెడ్డింగ్ ప్లానర్లు, క్యాటరర్ల డైరీలు పూర్తిగా నిండిపోయాయి. తెలుగు రాష్ట్రాల్లో చాలా చోట్ల ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్ చేసుకున్న పరిస్థితి నెలకొంది. ఫంక్షన్ హాళ్లు, పురోహితులు, క్యాటరింగ్ సర్వీసుల రేట్లు ఆకాశాన్నంటడంతో వధూవరుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాదికి ప్రస్తుత ఏడాదికి ధరలు విపరీతంగా పెరిగాయి. పురోహితుల దగ్గర నుంచి క్యాటరింగ్ వాళ్లు, డెకొరేషన్స్, పెండ్లి సామాగ్రి, కూరగాయలు, మాంసం ధరలు భారీగా పెరిగాయి. ఇక ప్రధానమైన మ్యారేజ్ ఫంక్షన్ హాల్స్ ధరలు భగ్గుమంటున్నాయి. చిన్నచిన్న ఫంక్షన్ హాళ్లు సైతం లక్షల్లో చెల్లించాల్సిందే.. ఇక పెద్ద ఫంక్షన్ హాల్స్ అయితే.. రూ. 10లక్షల నుంచి రూ. 13లక్షలకు తక్కువకు రానిపరిస్థితి. పెళ్లిళ్లు, గృహప్రవేశాలతో పాటు ఇతర శుభకార్యాలకు ముహూర్తాలు వచ్చేస్తున్నాయి. ఈ క్రమంలో శుభకార్యాలకు సిద్ధమయ్యే పేద, మధ్యతరగతి కుటుంబాలు పెరిగిన ధరలతో ఆందోళన చెందుతున్నారు.

# మిర్చి మాములుగా లేదుగా ఎర్రబంగారమేనా...



**గుంటూరు :** గుంటూరు మార్కెట్‌కు మొత్తం 61,000 బస్తాల కొత్త మిర్చి చేరింది. ఇందులో నాన్–ఏసీ 40,000 నుంచి 45,000 బస్తాలు, ఏసీ 15,000 నుంచి 16,000 బస్తాలు వచ్చినట్లు తెలుస్తోంది. మార్కెట్‌కు వచ్చిన సరుకులో, ముఖ్యంగా ఏసీ శాంపిల్స్‌లో తేజా రకాలు అధికంగా కనిపించాయి, ఇది ఆ రకాల ధరలపై ప్రభావం చూపింది. రకాల వారీగా మిర్చి ధరల వివరాలు:తేజా రకాలు: తేజా, షార్కు తేజా, రోమి 26 వంటి తేజా సెగ్మెంట్ రకాల ధరలలో గురువారం కాస్త స్లో అయినట్లు కనిపించింది. భారీగా సరుకు రావడం వల్ల ఈ రకాలపై ఒత్తిడి పడింది. కొత్త తేజా రకాలు గరిష్టంగా రూ. 19,000 పలికాయి. ఏసీ తేజా రకాలు రూ. 18,500 నుంచి రూ. 19,000 లోపు అమ్ముడయ్యాయి. షార్కు తేజా, రోమి రకాలు రూ. 17,000 లోపే పలికాయి. కర్నూల్ డీడీ, నాటు, సీడ్ రకాలు: తేజా రకాల మినహా, ఇతర రకాల మార్కెట్ స్థిరంగా, డిమాండ్‌తో కొనసాగింది. కర్నూల్ డీడీ 341 రకం గరిష్టంగా రూ. 25,000 పలికింది, కనిష్టంగా రూ16,000 క్వింటా అమ్ముడయ్యాయి. మధ్యస్థ రకాలకు రూ. 16,000 నుండి రూ. 20,000 వరకు ధరలు నమోదయ్యాయి. సీడ్ రకాలకు డిమాండ్ తగ్గకుండా, మార్కెట్ బాగానే ఉంది. నెంబర్ ఫైవ్ కొత్త మిర్చి రకాలు రూ. 16,000 నుంచి రూ. 23,000 వరకు, నాణ్యతను బట్టి రూ. 23,500 నుండి రూ. 24,000 వరకు పలికాయి. బ్యాడిగి రకాలు: 355 బ్యాడిగి కొత్త రకాలు రూ. 16,000 నుంచి రూ. 22,000 వరకు అమ్ముడయ్యాయి. సింజెంటా బ్యాడిగి కొత్త మిర్చి రకాలు రూ. 15,000 నుంచి రూ. 21,000 వరకు పలికాయి. ఇతర ప్రధాన రకాలు: 2043 ఈ రకం మార్కెట్ బాగానే ఉంది. నాణ్యత ఉన్న మిర్చి లభ్యత తక్కువగా ఉండటంతో, మంచి నాణ్యతకు రూ. 30,000 పైన, ఏసీ రకాలకు రూ. 35,000 వరకు ధరలు నమోదయ్యాయి. సాధారణ క్వాలిటీ రూ. 30,000 నుంచి రూ. 32,000 వరకు పలికింది. బంగారం: కొత్త మిర్చి రకాలు రూ. 15,000 నుంచి రూ. 20,000 వరకు అమ్ముడయ్యాయి. ఏసీ రకాలు రూ. 19,500 నుంచి రూ20,000 వరకు పలికాయి. బుల్లెట్: ఈ రకం కూడా బంగారం రకం వలె రూ. 15,000 నుంచి రూ. 20,000 వరకు పలికింది. ఏసీ రకాలు రూ. 19,500 నుంచి రూ. 20,000 వరకు అమ్ముడయ్యాయి. 273 కుబేరా: నాణ్యతను బట్టి రూ. 20,000 నుంచి రూ. 21,000 వరకు, ఒరిజినల్ నాణ్యత రూ. 22,000 వరకు పలికింది. ఏసీ రకాలు రూ. 20,000 నుంచి రూ. 21,000 వరకు పలికాయి. నాటు రకాలు: రూ. 21,000 నుంచి రూ. 22,000 వరకు అమ్ముడయ్యాయి. 334 రకం కూడా నాణ్యతను బట్టి రూ. 22,000 వరకు పలికింది. ఆర్మూర్: ఈ రకం రూ. 17,000 నుండి రూ. 17,500 వరకు అమ్ముడై, అమ్మకాలు బాగానే ఉన్నాయి. కొత్తవి రూ. 17,500 వరకు పలికాయి, బుధవారం రూ. 18,000 కూడా జరిగింది. ఏసీ రకాలు రూ. 16,500 నుంచి రూ. 17,500 వరకు పలికాయి. క్లాసిక్: ఈ రకం రూ. 17,000 పరిధిలో మార్కెట్ నడుస్తోంది. 108 వన్: కొత్తవి రూ. 15,000 నుంచి రూ. 16,000 నుంచి ప్రారంభమై, నాణ్యతను బట్టి రూ. 23,000 వరకు, గరిష్టంగా రూ. 23,500 వరకు పలికాయి. నాందేడ్ సీడ్ రకాలు: రూ. 15,000 నుంచి రూ. 16,000 పరిధిలో ఉన్నాయి. ఎల్లో మిర్చి:నాణ్యమైన డీలక్స్ రకాలు రూ. 48,000 నుంచి రూ. 49,000 వరకు అద్భుతంగా అమ్ముడయ్యాయి. తాలు రకాలు: కొత్త తాలు, డీడీ తాలు, 341 తాలు, నెంబర్ ఫైవ్ తాలు వంటి రంగు తాలు రూ. 15,000 వరకు పలికాయి. మెత్త తాలు రూ. 10,000 నుంచి రూ. 11,000 వరకు, మంచి రంగు తాలు రూ. 13,000 నుండి రూ. 15,000 వరకు పలికాయి. తేజా తాలు రంగు తాలు రూ. 12,500 పరిధిలో అమ్ముడయ్యాయి. 334 తాలు రూ. 10,000 పైన మంచి ధరలు పలికాయి. మొత్తం మీద, గుంటూరు మార్కెట్‌కు భారీగా సరుకు రావడంతో, ముఖ్యంగా తేజా రకాలపై కొంత ఒత్తిడి పెరిగి ధరలు మందగించాయి. అయితే, నాణ్యతను బట్టి ఇతర సీడ్, బ్యాడిగి, నాటు రకాలు స్థిరంగా మంచి ధరలు పలికాయి. మార్కెట్ నాణ్యతపై ఆధారపడి నడుస్తుందని అర్థమవుతుంది. అనేక మిర్చి వెరైటీలు ఇప్పటికే క్వింటాలుకు రూ. 25,000 మార్కును దాటాయి. మిర్చి ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలు సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోవడం. నల్లి, ఇతర తెగుళ్ల కారణంగా వేసిన పంట దిగుబడి కూడా ఆశాజనకంగా లేకపోవడమే. కొత్త పంట మార్కెట్‌లోకి వస్తున్నప్పటికీ, ధరలు నిరంతరం పెరుగుతున్నాయి, ఇది ప్రస్తుత ధోరణి కొనసాగుతుందని సూచిస్తుంది. చాలా వెరైటీలకు తదుపరి లక్ష్యం రూ. 30,000 గా ఉంది. ఇప్పటికే పసుపు మిర్చి క్వింటాలుకు రూ. 44,000 చేరుకుంది, ఇది రూ. 70,000 కు వెళ్లినా ఆశ్చర్యపోనవసరం లేదని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. అయితే ఇది తక్కువ మంది రైతులు మాత్రమే సాగుచేస్తున్నారు. కోల్డ్ స్టోరేజీలలోని స్టాక్ సుమారు 20 రోజులలో ఖాళీ అయిపోయే అవకాశం ఉంది. వ్యాపారస్తులు సరుకు కోసం తీవ్రంగా పోటీపడుతున్నారు. రైతులు మంచి ధర వస్తుందని ఆశించి కోల్డ్ స్టోరేజీల నుంచి సరుకును బయటకు తీయడం లేదు. గత వారం రోజులుగా, అన్ని రకాల మిర్చి ధరలు ప్రతిరోజూ పెరుగుతూనే ఉన్నాయి.

# అమరావతికి చట్టబద్ధత దిశగా అడుగులు...

**విజయవాడ :** ఇకపై ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అని గర్వంగా చెప్పుకునే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్న భావన రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. అధికారికంగా రాజధానికి చట్టబద్ధత కల్పించే ప్రక్రియ తుదిదశకు చేరుతోందని సమాచారం. ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లోనే దీనికి సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టే అవకాశం ఉందని చెబుతున్నారు. దీంతో అమరావతి రాజధాని అంశంపై కౌంట్‌డౌన్ మొదలైనట్టే అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అమరావతి కి చట్టబద్ధత కల్పించే ప్రక్రియ ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. సంబంధిత బిల్లు పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టేందుకు కేంద్ర మంత్రిత్వశాఖ కసరత్తు చేస్తోంది. ముసాయిదా క్యాబినెట్ నోట్ను కేంద్ర గృహ నిర్మాణ పట్టణాభివృద్ధి, న్యాయ వ్యయ శాఖలతో పాటు, నీతి ఆయోగ్లకు పంపి, అభిప్రాయం కోరింది. న్యాయ శాఖ ఇప్పటికే అభిప్రాయం తెలియజేసిందని సమాచారం. ముసాయిదా నోట్పై త్వరగా అభిప్రాయం తెలియజేయాలని మిగతా శాఖలకూ మంత్రిత్వశాఖ సూచించినట్లు తెలిసింది. కేంద్రమంత్రి వర్గం ఆమోదం తర్వాత, న్యాయశాఖ బిల్లు సిద్ధం చేస్తుంది. మళ్లీ దాన్ని క్యాబినెట్ ఆమోదించాక, పార్లమెంటులో ప్రవేశపెడతారుఆంధ్రప్రదేశ్‌కు శాశ్వత రాజధానిగా అమరావతికి చట్టబద్ధత రావాలంటే ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం లో సవరణలు చేయాల్సి ఉంటుంది. 2014 జూన్ 2 నుంచి పదేళ్ల పాటు హైదరాబాద్ ను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఉమ్మడి రాజధానిగా పేర్కొన్నారు. ఆ గడువు 2024 జూన్ 2తో ముగిసినా, ఇప్పటివరకు ఏపీకి రాజధానిని అధికారికంగా ప్రకటించలేదు. దీంతో ఇప్పుడు కేంద్రం ముందుకు స్పష్టమైన ప్రతిపాదన వెళ్లింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అమరావతిని రాజధానిగా గుర్తించాలంటూ కేంద్రానికి ప్రతిపాదనలు పంపించింది. రాజధాని ఎంపికకు అనుసరించిన విధాన ప్రక్రియతో పాటు, అక్కడ జరుగుతున్న నిర్మాణాలు, భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలను కూడా ఒక సమగ్ర నివేదిక రూపంలో వివరించింది. అమరావతిని అధికారిక రాజధానిగా ఖరారు చేయాలని కేంద్రాన్ని స్పష్టంగా కోరింది. దీనిపై కేంద్ర హోంశాఖ పూర్తి స్థాయిలో కసరత్తు ప్రారంభించిందని తెలుస్తోంది.

Edited, Published and Owned by **Ramancharla Srikanth** & Printed by **V. Raj Kumar** at **RK PRINTERS**, # 1-7-210/2, Kamala Nagar, Opp ECIL Bus Stop, ECIL, Hyderabad, Telangana - 500062 & Published from Sri Lakshmi Narsimha Colony, Flat No.106. Balaji Nagar, Kapra, Medchal Dist., Telangana - 500087. **RNI No.: TELTEL/2023/90269**. Editor: **RAMANCHARLA SRIKANTH**, Mob: **9963708331**, Email: telanganashaan331@gmail.com